జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | శుక్రవారం 13 నవంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :298 | పేజీలు : 12 | వెల : 3/-

PRGI No. APTEL/26/A0119,




సంవత్సరం: శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం: ఆశ్వయుజ మాసం ఋతువు: శరద్ ఋతువు ఆయనం: దక్షిణాయణం విశేషం: అమావాస్య, దీపావళి, నరక చతుర్దశి, లక్ష్మీ పూజసూర్యోదయం: 6.03 సూర్యాస్తమయం: 5.19 చంద్రోదయం: 5.49 చంద్రాస్తమయం: 4.46 తిథి: బహుళ చతుర్దశి ఉ. 10.26 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: స్వాతి పూర్తిగా ఉంది యోగం: ఆయుష్మాన్ రా. 3.44 వరకు, తదుపరి సౌభాగ్యం కరణం: శకుని ఉ. 10.26 వరకు, తదుపరి చతుష్పాదం రా. 10.43 వరకు, తదుపరి నాగం

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

వ్యక్తిగత దూషణలను సహించేది లేదు



- సోషల్ మీడియా దూషణలపై జనసైనికులకు వైసీపీ లీగల్ సెల్ హెచ్చరిక!
- జగన్, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆరోపణలు
- వ్యక్తిగత దూషణలకు దిగితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం
- సోషల్ మీడియా ఖాతాల వివరాలు గుర్తించామని వైసీపీ లీగల్ విభాగం ప్రకటన




వ్యవసాయ రంగంలో ఆధునిక విప్లవం రావాలి..
అప్పుడే వికసిత్ భారత్ సాధ్యం

- సాగును స్మార్ట్‌గా మార్చాలి.. రైతులకు మరింత సాధికారత కల్పించాలి
- వ్యవసాయ ఎగుమతుల విలువ రూ.4 లక్షల కోట్లకు పైనే.. అనుబంధ రంగాల్లోనూ భారీ వృద్ధి
- పాల ఉత్పత్తి 70 శాతం పెరిగింది.. మత్స్య సంపద, కోళ్ల పరిశ్రమలోనూ పురోగతి

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి

- పెట్టుబడులే లక్ష్యం.. అభివృద్ధే అజెండా!
- సీఐఐ భాగస్వామ్య సదస్సులో 303 ఒప్పందాలు
- రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు
- జూన్ 2024 నుంచి ఇప్పటివరకు రూ.32.49 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు
- ఇంధనం, ఎలక్ట్రానిక్స్, రక్షణ, డేటా సెంటర్లు, క్వాంటం టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి




విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రధాన పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన అభివృద్ధి ప్రణాళికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా వివరించారు. పరిశ్రమలు, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్స్, రక్షణ, అంతరిక్షం, డేటా సెంటర్లు, పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వేలు, సాగునీటి రంగాల్లో రాష్ట్రానికి ఉన్న అవకాశాలను గణాంకాలతో సహా ప్రజెంటేషన్ రూపంలో వెల్లడించారు. ఈ సదస్సులో 303 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించనున్నట్లు - మిగతా 3లో

క్లీన్ ఎనర్జీలో ఏపీని సౌదీ అరేబియాలా

తీర్చిదిద్దుతాం!



- పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి.. గ్రీన్ ఎనర్జీ ఎగుమతులే లక్ష్యం
- 2028 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రెట్టింపు అయ్యే అవకాశం
- రూ.36 వేల కోట్ల పెట్టుబడితో క్లీన్‌మాక్స్ ప్రాజెక్టు.. మరో రూ.3 వేల కోట్లతో బ్యాటరీ గిగా ఫ్యాక్టరీ
- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం: మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం

క్లీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను సౌదీ అరేబియాతో సమానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా భారీగా స్వచ్ఛమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతోపాటు, దానిని గ్రీన్ మాలిక్యూల్స్‌గా మార్చి అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసే సామర్థ్యం రాష్ట్రానికి ఉందని తెలిపారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో 'భారతదేశ ఇంధన భవిష్యత్తుకు ఊతం: పునరుత్పాదక ఇంధన వనరులు, గ్రీన్ హైడ్రోజన్' అంశంపై నిర్వహించిన ప్రత్యేక ప్లీనరీలో లోకేశ్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మారుతున్న అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ - మిగతా 3లో

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

- ఏపీ, తమిళనాడు తీరాలకు వర్ష ముప్పు!
- నవంబర్ 13న అల్పపీడనం..
- 15 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం
- తుపానుగా మారితే 'అక్వాన్'గా నామకరణం..
- తీరం దిశపై ఇంకా స్పష్టత లేదు
- ఉత్తరాదిలో ఇంకా మొదలుకాని చలి తీవ్రత

దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాలు..





వాషింగ్టన్‌లో కాల్పులు.. వైట్ హౌస్ సమీపంలో మరోసారి కలకలం

ఏపీలో 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్

- ఈ నెల 26న పోలింగ్!
- 4 కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీల్లో ఎన్నికలు
- 1,009 వార్డులు.. 24.98 లక్షల మంది ఓటర్లు
- 2,801 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు.. 30న ఓట్ల లెక్కింపు



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. నాలుగు నగరపాలక సంస్థలు, 19 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఈ నెల 26న పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ నెల 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు పరిష్కారం కావడంతో రెండో విడత ఎన్నికల నిర్వహణకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీసు - మిగతా 3లో



శత్రువుకు కోలుకునే అవకాశం ఇవ్వొద్దు

- ఆకస్మిక దాడులను తిప్పికొట్టాలి
- ఆధునిక యుద్ధ తంత్రాలకు అనుగుణంగా త్రివిధ దళాలు సిద్ధం కావాలి
- డ్రోన్లు, క్షిపణులు, సైబర్ దాడులపై ప్రత్యేక వ్యూహాలు అవసరం
- ఆపరేషన్ సింధూర్‌లో ఐఏఎఫ్ పనితీరుపై రక్షణ మంత్రి ప్రశంసలు

లోక్‌సభ స్థానాల పెంపునకు కేంద్రం కసరత్తు

- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకు సన్నాహాలు!
- మహిళా రిజర్వేషన్ల అమలే లక్ష్యంగా రాజ్యాంగ సవరణకు యత్నం
- 850 వరకు లోక్‌సభ స్థానాల పెంపుపై ప్రతిపాదనలు..
- దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలకు భరోసా ఇచ్చేలా కొత్త ముసాయిదా?
- బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం..
- సంఖ్యాబలం తమకు ఉందంటున్న ప్రభుత్వ వర్గాలు



గూఢచర్యం నెపంతో టెక్నాలజీ దిగ్బంధం..
అమెరికాపై నిప్పులు చెరిగిన చైనా

- ఎన్విడియా సీఈవోపై గూఢచర్యం ఆరోపణలను ఖండించిన చైనా
- టెక్నాలజీ ఆంక్షల కోసమే అమెరికా కుట్రలని బీజింగ్ వ్యాఖ్య
- వివాహేతర సంబంధం ఉన్నా భద్రతా ఉల్లంఘన జరగలేదన్న ఎన్విడియా
- ఈ వ్యవహారంపై ఎఫ్‌బీఐ విచారణ చేస్తోందన్న అధ్యక్షుడు ట్రంప్
- షెన్‌జెన్‌లో వచ్చే వారం జరగనున్న ట్రంప్, జిన్‌పింగ్ కీలక భేటీ

మాలలకు మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలి

మున్సిపాలిటి లో మాలలకు సముచిత స్థానం కల్పించాలి

జిల్లా కేంద్రం లో మాలల ఓటు బ్యాంకు కు అధిక ప్రాధాన్యత కలదు

మాల ప్రజల సమస్యలపై త్వరలో మంత్రులకు వినతి పత్రం అందజేస్తాము

మాలమహానాడు జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి



నంద్యాల: నవంబర్=12 ప్రజాజ్యోతి నంద్యాల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పదవి మాలలకు కేటాయించాలని మాల మహానాడు జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి, మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైసి పుల్లయ్య లు కోరారు. గురువారం నంద్యాల పట్టణంలోని మాల మహానాడు స్థానిక జిల్లా కార్యాలయంలో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంగా మాలలకు ప్రాధాన్యత ఇవ్వాలని నంద్యాల మున్సిపాలిటీ లో మాలలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. అదేవిదంగా మాలలకు పాలన వ్యవస్థలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నామన్నారు. జిల్లా కేంద్రం లో మాలల ఓటు బ్యాంకు కు అధిక ప్రాధాన్యత కలదని మాల ప్రజలు ఏ పార్టీ వైపు మొగ్గు చూపితే ఆ పార్టీ మాత్రమే అధికారం లోకి వస్తుందనే విషయం నంద్యాల ప్రజలతో పాటు, రాజకీయ నాయకులకు తెలుసన్నారు. మరి ముఖ్యంగా త్వరలో మాల మహానాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా లోని మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండీ ఫరుక్, రాష్ట్ర రోడ్డు రవాణా, పెట్టుబడుల శాఖ మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి లను కలిసి వినతిపత్రం అందజేస్తామని, మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నంద్యాల జిల్లా లాయర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్ ప్రసాదు తదితర మాల నాయకులు పాల్గొన్నారు

గుడిసె దగ్ధమైన కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం



దేవనకొండ- ప్రజా జ్యోతి న్యూస్ (రాఘవేంద్ర) :-దేవనకొండ పట్టణంలోని బీసీ కాలనీలో బోయ నాగరాజుకు చెందిన గుడిసె బుధవారం సాయంత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. దీంతో నిరాశ్రయులైన నాగరాజు కుటుంబాన్ని టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి డా. షేక్ సాధిక, టీడీపీ సీనియర్ నాయకులు ఈదుల దేవరబండ సుభాన్,ఎంపీటీసీ ఆకుల వీరేష్, పరామర్శించి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులు, సహాయ సహకారాలు అందేలా తమ వంతు కృషి చేస్తామని, ప్రభుత్వ సహాయంతో పాటు తమ సహకారం కూడా ఎల్లప్పుడూ ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. వెంకటసాయి ట్రేడర్స్ నిర్వాహకుడు కట్టా వేణుగోపాల్, శివ రేకుల షెడ్డు నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందించి నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన నాయకులకు నాగరాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బండి గింజల రంగన్న, సిలివేరి రామాంజి, శ్రీరాములు, కుక్కల తిమ్మయ్య, చంద్ బాషా, రాజసాహెబ్, రాజు గోపాల్ గౌడ్, బాలకృష్ణ, మోదీన్, రమేష్, శ్రీను, మజీద్, సుభాన్, రాముడు, చిన్నప్పతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

మృతదేహానికి నివాళులుఅర్పించిన కాటసాని తిరుపాల్ రెడ్డి





బనగానపల్లె:నవంబర్=12 ప్రజాజ్యోతి బనగానపల్లె నియోజకవర్గం అవుకు మండలం రామాపురం గ్రామ వైఎస్సార్సీపీ కార్యకర్త మల్లు విశ్వనాథ రెడ్డి మృతి చెందడంతో వారి స్వగృహానికి వెళ్లి మృత దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పేరం వెంకట సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, సుధాకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, రామచంద్రుడు గిరి రామారావు ప్రకాశ్, ప్రమోద్, తల్లం సుబ్రమణ్యం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

శిక్షణతో నాణ్యమైన విద్య సీడీపీఓ జహరాబీ



గాలివీడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారంతోపాటు సులువుగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ జహరాబీ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ...పడాయ్ భీ.. శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఆటపాటలతో కూడిన అభ్యాసాలు ప్రతిరోజూ చిన్నారు లతో చేయించాలన్నారు. చిన్నారుల సమగ్రాభివృద్ధిలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమన్నారు. చిన్నారులకు పాఠశాల పూర్వదశలోనే నాణ్యమైన ప్రాథమిక విద్యను అందించాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శారదమ్మ, సోనీ మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరివెళ్ల మండలంలో ధూపదీప పూజా సామగ్రి పంపిణీ

కార్తీక మాసం సందర్భంగా దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 50 ఆలయాలకు పూజా సామగ్రి అందజేత



నంద్యాల:సిరివెళ్ల:నవంబర్=12 ప్రజాజ్యోతి కార్తీక మాసం సందర్భంగా సిరివెళ్ల మండలంలోని పలు హిందూ దేవాలయాలకు దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధూపదీప పూజా సామగ్రిని పంపిణీ చేశారు. ఆలయాల్లో నిత్యం దీపారాధన, పూజలు కొనసాగాలనే ఉద్దేశంతో ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వర రెడ్డి ఈ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వర రెడ్డి మాట్లాడుతూ, కార్తీక మాసంలో సిరివెళ్ల మండలంలోని సుమారు 50 దేవాలయాలకు ధూపదీప, నైవేద్య పూజా సామగ్రిని అందిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో గత కొన్నేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 6 వేల దేవాలయాలకు ట్రస్ట్ ద్వారా పూజా సామగ్రి అందించినట్లు పేర్కొన్నారు. గత ఏడాది కూడా ఊటుకూరు వెంకట్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలోని సుమారు 100 దేవాలయాలకు ట్రస్ట్ సహాయం అందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు స్వామి, మహేష్, రామ గోవిందస్వామి, సుబ్బరాయుడు, నిరంజన్‌తో పాటు ట్రస్ట్ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బొయలకుంట్ల సహకార సంఘు రైతులకు ఈ కేవైసీ తప్పనిసరి

చైర్మన్ కాటంరెడ్డి అరుణమ్మ,,

సీఈఓ కానాల దస్తగిరి,



శిరివెళ్ల (బోయలకుంట్ల)నవంబర్=12 ప్రజాజ్యోతి మండల పరిధిలోని బోయలకుంట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతు ఈ కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్ కాటంరెడ్డి అరుణమ్మ, సీఈఓ కానాల దస్తగిరి పిలుపునిచ్చారు. సభ్యత్వం ఉన్న ప్రతి రైతు ఆధార్, పొలంపాస్ పుస్తకం సహకార సంఘ బ్యాంకు అకౌంట్ నకలు ఫోటోలు వన్ బి అడంగల్ తదితర నకలు పత్రాలను అందజేయాలని చైర్మన్ మరియు సీఈఓ తెలియజేశారు. సభ్యత్వం ఉండి ఈ కేవైసీ అప్డేట్ చేసుకోక పోతే రైతులకు రాబోయే సహకార సంఘ ఎన్నికల్లో ఓటు హక్కు ఉండదని సూచించారు. సబ్సిడీ కింద వస్తున్నటువంటి భూసార మందులు గాని ఇతర అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాలు వర్తించవని సూచన ప్రాయంగా తెలిపారు. కావున బోయల కుంట్ల సహకార సంఘ సొసైటీ పరిధిలో గల ప్రతి రైతు సంబంధించిన పత్రాలు సొసైటీలో అందించి ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు.

దీపావళి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ లో నాగేంద్ర లెవెన్స్ ఘన విజయం



ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు పామిడి.దీపావళి పండుగ సందర్భంగా రామగిరి ఎగుతాండ లో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా జరిగింది. ఫైనల్ లో రామగిరి ఎగు తాండా వర్సెస్ నాగేంద్ర లెవెన్స్ పామిడి జట్లు తలపడ్డాయి.టాస్ గెలిచిన పామిడి నాగేంద్ర లెవెన్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత ఓవర్లలో 122 పరుగులు చేసింది. అనంతరం 123 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రామగిరి ఎగు తాండా టీం. 84 పరుగులకే ఆలౌట్ అయ్యారు. దీంతో నాగేంద్ర లెవెన్స్ పామిడి జట్టు 38 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి టోర్నమెంట్ విజేతగా నిలిచింది.

వైయస్ జగన్‌ను కలిసిన షేక్ ఫాతిమాబీ

నందికొట్కూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఫాతిమబీ



ప్రజా జ్యోతి నందికొట్కూరు నందకొట్కూరు మున్సిపల్ ఛైర్ పర్సనగా ఎన్నికైన షేక్ ఫాతిమాబీ మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. కుటుంబ సభ్యులతో సహా, పార్టీ కేంద్ర కార్యాలయంలో శ్రీ వైయస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆమె, నందికొట్కూరులో మున్సిపల్ ఎన్నికలు జరిగిన తీరు, ఆ తర్వాత కౌంటింగ్ కేంద్రంలో కూడా వెన్నుపోటు పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన అరాచకాలను వివరించారు. తను ఓడిపోయినట్లు ప్రకటించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారని తెలిపారు. అన్ని సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నందికొట్కూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైనందుకు ఫాతిమాబీని, వైయస్ జగన్ అభినందించారు. ప్రజలకు చేరువై నిత్యం వారితో మమేకం అవుతూ, వారి కష్టాలు తీర్చేందుకు పని చేయాలని ఈ సందర్భంగా వైయస్ జగన్ ఆమెకు సూచించారు.వైయస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ సుధీర్‌తో పాటు.. షేక్ ఫాతిమాబీ భర్త, పార్టీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్ అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ గఫార్ కూడా ఈ సందర్భంగా వైయస్ జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

కృష్ణవరంలో నేడు శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

తెల్లవారుజామున 4 గంటలకు ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠాపన

మధ్యాహ్నం 11 గంటల నుంచి భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం

అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ పిలుపు





ఎటపాక, నవంబర్ 12 (ప్రజాజ్యోతి):ఎటపాక మండలం, కృష్ణవరం పంచాయతీ పరిధిలోని కృష్ణవరం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈరోజు శుక్రవారం నాడు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ మరియు గ్రామస్తులు సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా జరగనుంది. అనంతరం ఉదయం 11 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ప్రత్యేకంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మహోక్రతువుకు చుట్టుపక్కల గ్రామాల భక్తులందరూ అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని, తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాన్ని స్వీకరించి ముత్యాలమ్మ తల్లి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కృష్ణవరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఒక ప్రకటనలో కోరారు.

ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో డి.వి. శంకర్‌రావుకు రెండు పతకాలు

అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడింపు

ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు ఘన సత్కారం



ఎటపాక, నవంబర్ 12 (ప్రజాజ్యోతి): అమెరికాలో ఇటీవల నిర్వహించిన ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు దేశరాజు వెంకట శంకర్‌రావు రెండు పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి గుర్తింపు తీసుకువచ్చారు. మాస్టర్-4, 83 కేజీల విభాగంలో రజత, కాంస్య పతకాలు సాధించిన శంకర్‌రావును భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు గురువారం అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శంకర్‌రావుకు పతకాన్ని అలంకరించి శాలువాతో సత్కరించారు. ఆయనకు శిక్షణ అందించిన సిటీ స్టైల్ జిమ్ కోచ్, జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.వి. రామిరెడ్డిని కూడా ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వయస్సుతో సంబంధం లేకుండా పట్టుదల, కఠోర శ్రమ, క్రమశిక్షణతో శంకర్‌రావు సాధించిన విజయం భద్రాచలం ప్రాంతానికే కాకుండా దేశానికే గర్వకారణమన్నారు. అంతర్జాతీయ వేదికపై భారత జెండాను రెపరెపలాడించిన ఆయన ప్రయాణం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. క్రీడాకారుడి విజయానికి వెనుక నిరంతర శిక్షణ, ప్రోత్సాహం అందించిన కోచ్ రామిరెడ్డి కృషి కూడా అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు.

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి

-మొదటిపేజీ తరువాయి


ప్రకటించారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి వచ్చిన రూ.22.60 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలకు ఇవి అదనమని తెలిపారు. దీంతో మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల విలువ రూ.32.49 లక్షల కోట్లకు చేరినట్లు వివరించారు. ఈ ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశ్రమల స్థాపన, ఉత్పత్తి, ఉపాధి కల్పనగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

714 ప్రాజెక్టులతో రూ.22.60 లక్షల కోట్ల ప్రతిపాదనలు

2024 జూన్ నుంచి సదస్సుకు ముందు వరకు రాష్ట్రానికి రూ.22.60 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టుల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని చంద్రబాబు తెలిపారు. వీటిలో రూ.17.10 లక్షల కోట్ల విలువైన 526 ప్రాజెక్టులకు భూమి కేటాయింపు, ప్రోత్సాహకాలు తదితర అంశాలపై ఆమోదం లభించిందన్నారు. మరో రూ.7.30 లక్షల కోట్ల విలువైన 303 ప్రాజెక్టులు నిర్మాణానికి సిద్ధమైనట్లు వెల్లడించారు. ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో సంఖ్యాపరంగా 58 శాతం నిర్మాణ సన్నద్ధత దశకు చేరుకున్నాయని ప్రజెంటేషన్‌లో వివరించారు. పెట్టుబడుల ప్రకటనలకే పరిమితం కాకుండా, వాటిని వాస్తవ పరిశ్రమలుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు.

పునరుత్పాదక ఇంధనంలో 160 గిగావాట్ల లక్ష్యం

పునరుత్పాదక ఇంధన రంగంలో 160 గిగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం వెల్లడించారు. ఇప్పటికే 114 గిగావాట్ల సామర్థ్యానికి ఆమోదం లభించిందన్నారు. సోలార్ సెల్



తయారీలో 42 గిగావాట్లు, ఇంగట్-వేఫర్ తయారీలో 53 గిగావాట్ల సామర్థ్యానికి అనుమతులు ఇచ్చినట్లు వివరించారు. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల తయారీ రంగాల్లో ఏటా రూ.4.20 లక్షల కోట్ల ఉత్పత్తి సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. ఈ రంగాలకు సంబంధించి ఇప్పటికే రూ.31,926 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. తయారీ రంగాన్ని విస్తరించడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక కార్యకలాపాలు, ఉపాధి అవకాశాలు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

రక్షణ, అంతరిక్ష రంగాల్లో భారీ పెట్టుబడులు

ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను, అంతరిక్ష రంగంలో మరో రూ.25 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలనే ప్రణాళిక ఉందని సీఎం వివరించారు. ఐదో తరం యుద్ధవిమాన ప్రాజెక్టును 36 రోజుల్లోనే గ్రౌండింగ్ దశకు తీసుకువచ్చినట్లు తన ప్రజెంటేషన్‌లో పేర్కొన్నారు.

4.6 గిగావాట్ల డేటా సెంటర్లకు ఆమోదం

డేటా సెంటర్ల ఏర్పాటులో ఆంధ్రప్రదేశ్‌ను కీలక గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో 4.6 గిగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపినట్లు చంద్రబాబు వెల్లడించారు. డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ఆధునిక సాంకేతిక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అమరావతిలో క్వాంటం వ్యాలీ

రాజధాని అమరావతిని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా 250 ఎకరాల్లో క్వాంటం కంప్యూటింగ్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలిపారు. దక్షిణాసియాలో తొలి ప్రాజెక్టుగా అమరావతి క్వాంటం వ్యాలీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. 2027 ఫిబ్రవరి 3న ఈ ప్రాజెక్టును ప్రారంభించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు.

పెట్టుబడుల నుంచి ఉపాధి వరకు కార్యాచరణ

రాష్ట్రానికి భారీ పెట్టుబడి ప్రతిపాదనలు రావడం ఒక దశ మాత్రమేనని, వాటిని పరిశ్రమలుగా మార్చి ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు కల్పించడమే కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం భూముల కేటాయింపు, అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రోత్సాహకాల అమలుపై దృష్టి పెట్టినట్లు సీఎం వివరించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా వచ్చిన ఒప్పందాలు ఏ మేరకు కార్యరూపం దాల్చుతాయి, ఎంతమందికి ఉపాధి కల్పిస్తాయి అన్నది రానున్న కాలంలో కీలకం కానుంది.

వ్యక్తిగత దూషణలను సహించేది లేదు

అమరావతి: సోషల్ మీడియా వేదికగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నారంటూ జనసేన కార్యకర్తలపై వైసీపీ లీగల్ సెల్ తీవ్రంగా స్పందించింది. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో వ్యక్తిగత దూషణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

హద్దులు దాటుతున్నారంటూ ఆరోపణలు

పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాల నేపథ్యంలో జనసేన కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో హద్దులు దాటి వ్యవహరిస్తున్నారని వైసీపీ లీగల్ సెల్ ఆరోపించింది. జగన్, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని జుగుప్సాకరమైన భాషలో వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొంది. అంతేకాకుండా, ఈ వ్యాఖ్యలను రికార్డు చేసి వివిధ సోషల్ మీడియా వేదికల్లో ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని తెలిపింది.

సోషల్ మీడియా ఖాతాలపై నిఘా

ఈ వ్యవహారాన్ని పార్టీ లీగల్ విభాగం తీవ్రంగా పరిగణిస్తోందని వైసీపీ వెల్లడించింది. తమకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం, ఇటీవల ఎక్స్ (ట్విట్టర్) వేదికగా నిర్వహించిన స్పేస్‌లో జగన్ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని గోవాడ రాఘవేంద్ర నాయుడుగా గుర్తించినట్లు తెలిపింది.

అలాగే ఏGlass19Mar, @TYSON21AP, @werty1234up తదితర ఖాతాల ద్వారా ఆ వ్యక్తి కార్యకలాపాలు సాగిస్తున్నట్లు గుర్తించామని పేర్కొంది. ఈ ఖాతాలకు సంబంధించిన వ్యవహారంపై త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వైసీపీ లీగల్ సెల్ ప్రకటించింది.

వ్యక్తిగత దూషణలను సహించేది లేదు

సోషల్ మీడియాలో రాజకీయ విమర్శలు చేయడం ప్రజాస్వామ్య హక్కు అయినప్పటికీ, వ్యక్తిగత దూషణలు, అసభ్యకర వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదని వైసీపీ లీగల్ విభాగం స్పష్టం చేసింది. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

ఏపీలో 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్

-మొదటిపేజీ తరువాయి

సూపరింటెండెంట్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతిభద్రతల పరిరక్షణ, పటిష్ఠమైన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సుప్రీంకోర్టు జోక్యం, భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణతో ఎన్నికల నిర్వహణలో మెరుగైన పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను అధికారులు, పోలీసు యంత్రాంగం సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించారని అభినందించారు. రానున్న పంచాయతీ ఎన్నికలను కూడా సమర్థంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

24.98 లక్షల మంది ఓటర్లు

ఈ ఎన్నికల్లో మొత్తం 1,009 వార్డులకు సంబంధించి 24.98 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో మహిళలకు 503 వార్డులను కేటాయించినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 2,801 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. 283 మంది రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు వెల్లడించారు. పంచాయతీ ఎన్నికల మొదటి దశకు కూడా త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామని పునేఠా పేర్కొన్నారు.

ఎన్నికలు జరిగే నగరపాలక సంస్థలు

- శ్రీకాకుళం
- కాకినాడ
- రాజమహేంద్రవరం
- మంగళగిరి-తాడేపల్లి

పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు




- ఆమదాలవలస (శ్రీకాకుళం)
- రాజాం (విజయనగరం)
- పాలకొల్లు
- భీమవరం
- తాడేపల్లిగూడెం
- తణుకు (పశ్చిమగోదావరి)
- చింతలపూడి (ఏలూరు)
- గుడివాడ
- తాడిగడప (కృష్ణా)
- పొన్నూరు (గుంటూరు)
- నరసరావుపేట (పల్నాడు)
- కందుకూరు (ప్రకాశం)
- పొదిలి (మార్కాపురం)
- కావలి
- గూడూరు
- అల్లూరు (నెల్లూరు)
- శ్రీకాళహస్తి (తిరుపతి)
- బి.కొత్తకోట (అన్నమయ్య)
- బాపట్ల

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషనర్ అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు కల్పించాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అదనపు భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఎన్నికలతో పెండింగ్‌లో ఉన్న పట్టణ స్థానిక సంస్థల్లో పాలకవర్గాల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది.

క్లీన్ ఎనర్జీలో ఏపీని సౌదీ అరేబియాలా తీర్చిదిద్దుతాం!

-మొదటిపేజీ తరువాయి



పరిస్థితుల నేపథ్యంలో భారత్ ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

సౌర, పవన విద్యుత్‌కు అపార అవకాశాలు

రాయలసీమలో సమృద్ధిగా లభించే సూర్యరశ్మి, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పవన విద్యుత్ ఉత్పత్తికి అనుకూలమైన పరిస్థితులు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని లోకేశ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఇంధన స్వయం సమృద్ధి సాధించే దిశగా స్పష్టమైన ప్రణాళికతో ముందుకెళ్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఉత్పత్తి చేసే స్వచ్ఛమైన విద్యుత్‌ను కేవలం స్థానిక అవసరాలకే పరిమితం చేయకుండా, గ్రీన్ హైడ్రోజన్ వంటి ఉత్పత్తులుగా మార్చి విదేశీ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నది తమ ఆలోచనగా వివరించారు.

2028 నాటికి విద్యుత్ డిమాండ్ రెట్టింపు!

గత ఏడాది కాలంలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం దాదాపు 30 శాతం పెరిగిందని మంత్రి వెల్లడించారు. కొత్త పరిశ్రమలు, డేటా సెంటర్ల ఏర్పాటు నేపథ్యంలో 2028 నాటికి విద్యుత్ డిమాండ్ రెట్టింపు అయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ అవసరాలను తీర్చేందుకు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. సంప్రదాయ జలవిద్యుత్ ప్రాజెక్టుల తరహాలో దీర్ఘకాలం వేచి చూడకుండా, ఆధునిక సాంకేతికతను వినియోగించి నిర్మాణ వ్యయాలు పెరగకముందే ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాత్రి వేళల్లోనూ పోటీ ధరలకు నిరంతరాయంగా గ్రీన్ ఎనర్జీని అందించడమే తమ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

ఏడాదిలో 4.8 గిగావాట్ల సామర్థ్యం

పరిశ్రమల అభివృద్ధికి విధానపరమైన స్థిరత్వం ఎంతో ముఖ్యమని లోకేశ్ పేర్కొన్నారు. 2019--2024 మధ్య సరైన విధానాలు లేకపోవడం వల్ల రాష్ట్రం పునరుత్పాదక ఇంధన రంగంలో వెనుకబడిందని విమర్శించారు. ఆ ఐదేళ్లలో కేవలం 6 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే అదనంగా చేరిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలో 4.8 గిగావాట్ల సామర్థ్యాన్ని సాధించినట్లు వెల్లడించారు. పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు.

డేటా సెంటర్లపై అపోహలు వద్దు

రాష్ట్రంలో ఏర్పాటవుతున్న డేటా సెంటర్లపై వస్తున్న విమర్శలు, అపోహలను మంత్రి తోసిపుచ్చారు. గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రాజెక్టులు సంప్రదాయ నీటి ఆధారిత కూలింగ్ విధానానికి బదులుగా ఆధునిక ఎయిర్ కూల్డ్ సాంకేతికతను వినియోగిస్తాయని వివరించారు. ఒక గిగావాట్ థర్మల్ పవర్ ప్లాంట్‌తో పోలిస్తే డేటా సెంటర్లు దాదాపు పది రెట్లు తక్కువ నీటిని వినియోగిస్తాయని గణాంకాలను ప్రస్తావించారు. అంతేకాకుండా రాష్ట్రంలోని డేటా సెంటర్ల విద్యుత్ అవసరాల్లో కనీసం 80 శాతం గ్రీన్ ఎనర్జీ ద్వారానే సమకూర్చాలనే నిబంధన విధించినట్లు చెప్పారు. భారత పౌరుల డేటా దేశ సరిహద్దుల్లోనే భద్రంగా ఉండటం జాతీయ భద్రతకు కీలకమని పేర్కొన్నారు.

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని, ఇప్పటికే వివిధ రంగాల్లో దాదాపు 5 లక్షల ఉద్యోగాలు కల్పించగలిగామని లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలో గుర్తించిన 25 పారిశ్రామిక క్లస్టర్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో విద్యుత్ టారిఫ్‌లు తక్కువగా ఉన్నాయని, భవిష్యత్తులో వాటిని మరింత తగ్గించి పెట్టుబడులను ఆకర్షిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

రూ.36 వేల కోట్లతో క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టు

సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా మంత్రి నారా లోకేశ్ పలు ప్రముఖ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా జరిగిన ఈ చర్చల్లో పలు కీలక ప్రతిపాదనలు ముందుకొచ్చాయి. క్లీన్‌మాక్స్ సంస్థ రాష్ట్రంలో రూ.36 వేల కోట్ల పెట్టుబడితో సమగ్ర పునరుత్పాదక ఇంధనం, పంప్డ్ స్టోరేజ్, డేటా సెంటర్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. అలాగే ఆర్చియన్ కెమికల్స్ సంస్థ రూ.3 వేల కోట్లతో అధునాతన జింక్-బ్రోమైడ్ బ్యాటరీ గిగా ఫ్యాక్టరీ ఏర్పాటుకు సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. ఈ పరిశ్రమ ద్వారా సుమారు వెయ్యి మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని వెల్లడించారు.

తిరుపతిలో సెమీకండక్టర్ పార్క్!

తిరుపతిలో 200 ఎకరాల విస్తీర్ణంలో సెమీకండక్టర్ పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు సైయంట్ సంస్థ ఆసక్తి చూపినట్లు మంత్రి తెలిపారు. అరకు కాఫీని అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసే అంశంపై ఎస్ఎల్ఎన్ కాఫీ సంస్థ ప్రతినిధులతో చర్చించారు.

మహిళా సంఘాల ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్

రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేస్తున్న స్వయం ఏపీ, లేపాక్షి ఉత్పత్తులతో పాటు సముద్ర ఉత్పత్తులను అంతర్జాతీయ కొనుగోలుదారులకు అనుసంధానించాలని వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్ సంస్థల ప్రతినిధులను లోకేశ్ కోరారు. దీనిపై వాల్‌మార్ట్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని స్థానిక ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో గుర్తింపు తీసుకురావడంతో పాటు మహిళా సంఘాల ఆదాయాన్ని పెంచేందుకు ఈ ప్రయత్నాలు దోహదపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

శ్రీకాళహస్తి ఆలయ ప్రసాదాల తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం!

నెయ్యి ఒలకడంతో ఒక్కసారిగా చెలరేగిన మంటలు

విద్యుత్ తీగలు దగ్ధం.. అప్రమత్తమైన ఆలయ సిబ్బంది

అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో తప్పిన పెను ప్రమాదం

శ్రీకాళహస్తి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి దేవస్థానంలో గురువారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆలయ ప్రసాదాల తయారీ కేంద్రం (పోటు)లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది, భక్తులు ఆందోళనకు గురయ్యారు. అయితే ఆలయ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడం, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

నెయ్యి ఒలకడంతో మంటలు

గురువారం ఉదయం ప్రసాదాల తయారీ కోసం పోటు సిబ్బంది తమ పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో ప్రసాదాల తయారీకి ఉపయోగిస్తున్న వేడి నెయ్యి ఒలికి పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. మంటలు వేగంగా వ్యాపించడంతో కేంద్రంలోని విద్యుత్ తీగలు కాలిపోయాయి. ప్రమాదాన్ని గమనించిన పోటు సిబ్బంది వెంటనే అప్రమత్తమై బయటకు వచ్చారు. ఆలయ సిబ్బంది కూడా భక్తులను ఘటనాస్థలికి దూరంగా పంపించి, పరిసర ప్రాంతాల్లో రాకపోకలను నియంత్రించారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు



తీసుకున్నారు.

సకాలంలో మంటలను అదుపు చేసిన సిబ్బంది

అగ్నిప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆలయ సిబ్బందితో కలిసి మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటి ప్రయత్నం అనంతరం మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. తొలుత గ్యాస్ లీకేజీ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావించినప్పటికీ, వేడి నెయ్యి ఒలకడం వల్లే మంటలు చెలరేగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం.

భక్తులు ఆందోళన చెందవద్దు: ఈవో

ఈ ఘటనపై ఆలయ ఈవో బి.కె. వెంకటేశులు స్పందిస్తూ, సకాలంలో మంటలను అదుపులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగలేదని, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఆలయ ప్రసాదాల తయారీ కేంద్రంలో జరిగిన ఈ ఘటనతో భద్రతా ఏర్పాట్లపై మరోసారి దృష్టి పడింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ వైరింగ్, గ్యాస్ కనెక్షన్లు, అగ్నిమాపక పరికరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది.

పూత మరియు కాయదశలో ఉన్న మిరప పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ



ఎమ్మిగనూరు, నవంబర్ 12(ప్రజా జ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), బనవాసి మరియు కర్నూలు జిల్లా ఉద్యాన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పూత మరియు కాయదశలో ఉన్న మిరప పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఉద్యాన అధికారి శ్రీ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ, మిరపలో మొదలుకుళ్లు తెగులు మరియు రసం పీల్చే పురుగుల నివారణకు ట్రైకోడెర్మా, సూడోమోనాస్, బవేరియా, వేపనూనె వంటి జీవ నియంత్రణ పద్ధతులను వివరించారు. కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె. రవీంద్ర చౌదరి మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మిరపలో కాయ కుళ్లు తెగులు నివారణ, పోషకాల యాజమాన్యం, పూత మరియు పిందె రాలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మహానంది ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త శ్రీ నాయక్ మాట్లాడుతూ, ఎల్‌సీఏ 625 (తేజస్), ఎల్‌సీఏ 643 (బ్యాడిగ) రకాల సాగు, జిగురు అట్టలు, వేపనూనె వినియోగం ద్వారా చీడపీడల నివారణ గురించి వివరించారు. కర్నూలు జిల్లా డీఆర్‌ఎస్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ వెంకటేశ్వర్లు పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు మరియు పంట మార్పిడి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీచందన, డాక్టర్ రంజన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారులు శ్రీమతి శ్రీవాణి, ఇందిర, అపర్ణ, శ్రీ రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం -క్వింటాలుకు రూ.9,490 మద్దతు ధర

15 జిన్నింగ్ మిల్లుల్లో విడతలవారీగా కొనుగోళ్లు



ఆదోని: నవంబర్ 12 (ప్రజా జ్యోతి): ఆదోనిలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి సీతారామయ్య గురువారం వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం క్వింటాలు పత్తికి రూ.9,490 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.ప్రస్తుతం మార్కెట్‌లో మద్దతు ధర కంటే అధిక ధరకు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఒకవేళ మార్కెట్ ధరలు తగ్గితే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రంగంలోకి దిగి రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తుందని వివరించారు. ఆదోనిలోని 15 జిన్నింగ్ పరిశ్రమల్లో విడతలవారీగా కొనుగోళ్లు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎంపీపీ సీటు కోసం పోటీ పడుతున్న?

ఆ ముగ్గురు

15 ఎంపీటీసీ స్థానాలు కైవసం చేసుకున్న కూటమి..

మండలం లో ఎంపీపీ కుర్చీపై ఉత్కంఠ

నందవరం, నవంబర్ 12 (ప్రజా జ్యోతి): నందవరం మండల పరిధిలోని మొత్తం 17 ఎంపీటీసీ స్థానాలకు గాను 15 స్థానాలను కైవసం చేసుకుని కూటమి ప్రభుత్వం విజయభేరి మోగించింది. అయితే ఎంపీపీ పదవి ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో ఈ పదవిని దక్కించుకునేందుకు ముగ్గురు ఆశావహులు పోటీపడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా సాతర్ల లలితమ్మ, గురుజాల ఎంపీటీసీ చార్లెస్, ముగతి ఎంపీటీసీ మాసిపోగు ఈరన్న పేర్లు ఎంపీపీ రేసులో ప్రముఖంగా వినిపిస్తున్నాయి.



దీంతో ఈ ముగ్గురిలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎవరికి అవకాశం కల్పిస్తారనే అంశంపై మండల రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.ఎంపీపీ పీఠం కోసం ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. చివరకు అధిష్టానం ఆశీస్సులు, ఎమ్మెల్యే నిర్ణయమే కీలకం కానుండటంతో ఎంపీపీ సీటు ఎవరిని వరిస్తుందోనని మండల ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

క్రీడా సంబరాలకు ఎస్కేపి కళాశాల ముస్తాబు



గుంతకల్లు నవంబర్ 12 (ప్రజా జ్యోతి): స్థానిక ఎస్కేపి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతి పత్తి) లో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ బాలుర అంతర్ కళాశాలల గ్రూప్ –సి క్రీడా పోటీలు ఈనెల 13 మరియు 14 తేదీలలో నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఖో-ఖో, వాలీ బాల్, సపక్ తక్రా, సాఫ్ట్‌బాల్, చెస్ విభాగాల్లో పోటీలు నిర్వహించబడును.ఈ క్రీడల్లో పాల్గొ నడానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నుండి దాదాపు 300 మంది వరకు క్రీడాకారులు పాల్గొనడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు.

సెల్‌ఫోన్ వద్దు – క్రీడలు ముద్దు





ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు పెద్దవడుగూరు ఎస్సై రాఘవేంద్రప్ప రాయలసీమ జోనల్ తైక్వాండో పోటీలలో ప్రతిభ చాటిన ఆదర్శ విద్యా నికేతన్ విద్యార్థులకు అభినందన

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని పెద్దవడుగూరు ఎస్సై రాఘవేంద్రప్ప పిలుపునిచ్చారు. రాయలసీమ జోనల్ స్థాయి తైక్వాండో పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక ఆదర్శ విద్యా నికేతన్ పాఠశాల విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

పతకాలు సాధించిన విద్యార్థుల వివరాలు:

గోల్డ్ మెడల్ (బంగారు పతకం): కరణం సహస్ర ప్రగ్య, యు. హర్షిత సాయి రెడ్డి.

సిల్వర్ మెడల్ (రజత పతకం): బండారు రాకేష్, చాకలి పవన్ కుమార్.

బ్రాంజ్ మెడల్ (కాంస్య పతకం): షేక్ చాంద్ బాషా, కరణం అనిరుద్, బి. చక్రధర్ రెడ్డి.పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సై రాఘవేంద్రప్ప విజేతలకు సర్టిఫికెట్లు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై రాఘవేంద్రప్ప మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థులలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందని తెలిపారు. ఒలంపిక్స్ లో గల ఆత్మరక్షణ విద్య అయిన తైక్వాండోలో విద్యార్థులు రాణించడం అభినందనీయమని కొనియాడారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ కె. నారాయణ రావు మరియు ఉపాధ్యాయ బృందం కలిసి ఎస్సై రాఘవేంద్ర ప్పకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కరణం నారాయణరావు వైస్ ప్రిన్సిపాల్ కరణం మాధుర్యలహరి తైక్వాండో మాస్టర్ తలారి తులసిరామ్ ఉపాధ్యాయులు జె. పరమేశ్వర్ జె. దీప్తి బి.ఆదిలక్ష్మి ఎన్. వసుంధరదేవి ఎ. మమత డి. దస్తగిరమ్మ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్.. చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు నవంబర్ 12 (ప్రజా జ్యోతి): నిరుపేదల వైద్యం ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ పథకం ఆర్థికంగా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం పట్టణంలో ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయం నందు సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుమ్మనూరు జయరాం మరియు వారి సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి హాజరు కావడం జరిగినది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో వైద్యం తీసుకున్న వారికి పేదవారి కుటుంబానికి పెద్ద కొడుకుల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. గుంతకల్లు నియోజకవర్గం దాదాపు 2 సంవత్సరాలలో 1200 మందికి గాను 7 కోట్ల 39 లక్షల 710 రూపాయ లు అందించిన ఘనత బడుగు బలహీన వర్గాల ముద్దు బిడ్డ మన గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూ రు జయరాం కే దక్కుతుంద ని గుమ్మనూరు నారాయణ స్వామి తెలిపారు. గురువారం రోజు దాదాపుగా 41,42,34వ విడతలతో కలిపి 44 మంది గాను 25,24,020 రూపాయలు నిరుపేద కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఆర్థిక సహాయం చేయడం జరిగిందని ఎమ్మెల్యే గుమ్మడివరం తెలిపారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కుల లబ్ధిదారులు మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గంలో




జరిగిన స్థానిక సంస్థ ఎన్నికలలో మన కూటమి ప్రభుత్వం తరఫున పోటీ చేసిన వారిని గెలిపించి గుంతకల్లు నియోజకవర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు కి బహుమతిగా ఇచ్చాము అని ఈ సభముఖంగా తెలియజేస్తున్నారు. అలాగే జరగబోయే స్థానిక సంస్థ గ్రామ సర్పంచులు కూడా గెలిపించుకొని తీరుతామని తెలియజేస్తున్నాము, కూటమి ప్రభుత్వానికి మరియు గుమ్మనూరు కుటుంబానికి రుణపడి ఉంటామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మరియు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ బిఎస్ కృష్ణారెడ్డి, పట్టణ కన్వీనర్ గుణశేఖర్, కౌన్సిలర్లు రమేష్ గౌడ్, యూనూస్, నందీశ్వర్ టిడిపి సీనియర్ నాయకు లు తలారి మస్తానప్ప, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, శివన్న, వై సుధాకర్, పాత గుంతకల్లు రవి, పెద్దబాబు, ఓ చంద్రయ్య, పజుల్, సద్దాం హుస్సేన్, నగరడోన రవికుమార్, చింతకుంట శ్రీనివాసులు మరియు గుంతకల్లు నియోజకవర్గం కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగినది.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కలిసిన జె ఎ సి రాష్ట్ర కమిటీ

కూనవరం నవంబర్ 12, (ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు) విజయవాడలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ సభ్యులు అధికారులను కలవడానికి విజయవాడ వెళ్లడం జరిగింది అని అన్నారు మొదటిగా ఏపీ ఎన్జీవో స్టేట్ ప్రెసిడెంట్ విద్యాసాగర్ ని కలవడం జరిగింది మా స్ట్రైక్) సమ్మె రోజులు సంబంధించిన విషయం సార్ తో డిస్కస్ చేయడం జరిగింది సార్ కూడా అధికారులు దృష్టి తీసుకెళ్లి ఆ ఐదు రోజుల శాలరీ కూడా వచ్చేటట్టు మాట్లాడడానికి సారు సహకరిస్తారని తెలియజేయ డం అదేవిధంగా 100% గ్రాస్ జీతానికి సంబంధించిన అంశం కూడా సార్ తో డిస్కస్ చేయడం జరిగింది సార్ కూడా గవర్నమెంట్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి మాకు న్యాయం జరిగేలాగా చూస్తానని చెప్పడం జరిగింది జేఏసీ తరఫున విద్యాసాగర్ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసుకుంటు న్నాము తర్వాత డైరెక్టరేట్ మెడికల్ ఎడ్యుకేషన్ వారిని డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారిని కూడా కలవడం జరిగింది నిధి పోర్టల్ సంబంధించినటువంటి అంశం మరియు ఈ స్ట్రైక్ సంబంధించిన విషయాలను డిస్కస్ చేయడం జరిగింది నిధి కి సంబంధించిన అంశాన్ని వీలైనంత తొందర



గా ఎవరికి అయితే టెక్నికల్ ఎర్రర్స్ ఉన్నాయో అవి మరియు ఎవరెవరికి అయితే ఔట్సోర్సింగ్ బేసెస్లో వేకెన్సీస్ లో వాళ్ళని రిక్వెస్ట్ చేయడం జరిగిందో వాళ్ళ విషయాన్ని కూడా వీలైన తొందరగా పరిష్కరించాలని కోరడం జరిగింది మిగతా ఇంకా ఏమైనా ఉన్నా అవన్నీ కూడా గవర్నమెంట్ దృష్టి తీసుకెళ్తానని చెప్పి ఈ సార్ వాళ్ళు హామీ ఇవ్వడం జరిగింది ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము అదేవిధంగా ఈరోజు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కమిషనర్ అయినటువంటి చక్ర ధర్ ని కలవడానికి వెళ్లడం జరిగింది అందుబాటులో



లేకపోవడం వల్ల అక్కడ ఉన్నటువంటి అధికారుల్ని కలవడం ఈ 100% గ్రాస్ కి సంబంధించిన డేటా గురించి మరియు నిధి అప్ కి సంబంధించిన విషయాలను కూడా చర్చించడం జరిగింది. వాళ్ళు సమస్యలు సర్ దృష్టికి తీసుకెళ్దాం అని చెప్పి హామీ ఇవ్వడం జరిగింది వాళ్ళకి కూడా జె ఎ సి నుంచి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసుకుంటూ ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కోటేశ్వరరావు మరియు కన్వీనర్ అజయ్ కో చైర్మన్ జోగారావు మరియు జె ఎ సి ప్రతినిధులు అందరూ కూడా పాల్గొనడం జరిగింది

మాండ్ర శివానందరెడ్డి వర్గానికి షాక్.. బైరెడ్డి వర్గంలోకి కీలక నేతలు!

నందికొట్కూరు టీడీపీలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

ప్రజా జ్యోతి -- నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణ తెలుగుదేశం పార్టీ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పట్టణ టీడీపీ అధ్యక్షుడు, 29వ వార్డు కౌన్సిలర్ గుంజపల్లి భాస్కర్ రెడ్డి, 30వ వార్డు కౌన్సిలర్ మోహన్ రెడ్డి సతీమణి గుంజపల్లి విజయలక్ష్మి బైరెడ్డి రాజశేఖర రెడ్డి సమక్షంలో ఎంపీ వర్గంలో చేరారు.ఇప్పటివరకు మాండ్ర శివానందరెడ్డి వర్గానికి సన్నిహితంగా కొనసాగిన నాయకులు ఒక్కసారిగా బైరెడ్డి వర్గంలోకి చేరడం పట్టణ టీడీపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా పట్టణ పార్టీ అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న గుంజపల్లి భాస్కర్ రెడ్డి వర్గ మార్పు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ పరిణామం మాండ్ర శివానందరెడ్డి వర్గానికి రాజకీయంగా ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. పట్టణ టీడీపీలో ఇప్పటికే కొనసాగుతున్న వర్గ విభేదాల నేపథ్యంలో తాజా చేరికలు ఎలాంటి పరిణామాలకు



దారితీస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.కీలక నాయకుల చేరికతో బైరెడ్డి వర్గానికి పట్టణంలో మరింత బలం చేకూరుతుందా? మాండ్ర వర్గం ఈ పరిణామాలను ఎలా ఎదుర్కొంటుంది? అన్నది ఇప్పుడు స్థానిక రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

మీ ఇంట ఆడబిడ్డగా వస్తున్నా ఆశీర్వదించి గెలిపించండి

శంఖవరం సర్పంచ్ అభ్యర్థి మేకల వీర సూర్యకళ కృష్ణ



శంఖవరం, నవంబర్ 12, (ప్రజాజ్యోతి న్యూస్) : శంఖవరం గ్రామంలో గడిచిన కొన్నేళ్ళుగా పెత్తందార్ల పాలనలో శంఖవరం గ్రామ పంచాయతీ కొనసాగడం వల్ల అవినీతిమయంగా మారిందని, వీటి ప్రక్షాళనకు, అవినీతి రహిత పాలనకు తనకు మద్దతు ఇవ్వాలని సర్పంచ్ అభ్యర్థి మేకల వీర సూర్యకళ కృష్ణ అన్నారు. గ్రామంలోని మేకల కృష్ణ గృహంలో గురువారం విలేకర్ల సమావేశంలో సూర్యకళ కృష్ణ మాట్లాడారు. మన శంఖవరం గ్రామంలో 40ఏళ్ళుగా పంచాయతీ పాలన సాగించిన నాయకులు వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకుని, గ్రామాన్ని అభివృద్ధిలో కుంటుపరిచారని విమర్శించారు. ఇప్పటికే తాను సమాచార హక్కు చట్టం ద్వారా పంచాయతీలో జరిగిన అవినీతిని ఒక సామాజిక కార్యకర్తగా వెలికితీసి, అంచలంచెలుగా నిరోధించగలిగామన్నారు. నన్ను గ్రామ సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసి, పేద, మధ్య తరగతి కుటుంబాల ఆశయాలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తామన్నారు. ఇప్పటి వరకు ఎన్నడూ శంఖవరంలోని ప్రజలకు పంచాయతీ ఆదాయ, వ్యయాలపై మన పాలకులు ఏనాడు కనీస సమాచారం కూడా ఇప్పటి వరకు ప్రజలకు వెల్లడించలేదన్నారు. ఇప్పటికీ గ్రామంలో తాగునీటి ఇక్కట్లు, డ్రైనేజీ వ్యవస్థ లోపం, తుప్పు పట్టిన వాటర్ ట్యాంకు పైపులైన్లు, ముఖ్యంగా రోడ్లు అధ్వాన్న స్థితికి చేరుకున్నప్పటికీ ఇదిగో, అదిగో అనడం మినహాయించి పెత్తందార్లు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కాని తనను సర్పంచ్ గా గెలిపిస్తే ప్రతీ ఆరు నెలలకోసారి పంచాయతీ ఆదాయ, వ్యయాలపై సోషల్ ఆడిట్ చేసిన నివేదికలను కరపత్రాలు ముద్రించి, ప్రతీ రామాలయం వద్ద, చర్చిల వద్ద, ముఖ్య కూడళ్ళ వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. పంచాయతీ గ్రామసభలను పార్టీ కార్యకర్తలు, ఇతరులతో కాకుండా గ్రామానికి చెందిన ప్రజల సమక్షంలో పూర్తి పారదర్శకంగా పంచాయతీలో నిర్వహించి, వారి విలువైన సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మన శంఖవరం గ్రామం పెత్తందార్లకు ఎన్నో విలువైన పదవులు ఇచ్చింది. మన గ్రామం మాత్రం ఇప్పటికీ వెనుకబడే ఉందని, ఇప్పటికైనా ప్రజలు విజ్ఞతతో ఆలోచన చేసి, మీలో ఒకరినైన, సామాన్యురాలునైన తనను సర్పంచ్ గా గెలిపించాలని మేకల వీర సూర్యకళ కృష్ణ కోరారు.

మలేరియా నివారణకు గంబూషియా చేపలతో చర్యలు!





నీటి నిల్వ గుంటల్లో దోమల లార్వా నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమం

కూనవరం నవంబర్ 12, (ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు) మలేరియా వ్యాధి నివారణలో భాగంగా కూనవరం మండలంలోని జగ్గవరం గ్రామంలో నీటి నిల్వ గుంటల్లో దోమల లార్వా వృద్ధిని అరికట్టేందుకు గంబూషియా చేపలను వదిలారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు కూనవరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చేతన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.గ్రామ పరిధిలో నీరు నిల్వ ఉన్న గుంటలను గుర్తించి వాటిలో గంబూషియా చేపలను వదలడం ద్వారా దోమల లార్వా పెరుగుదలను నియంత్రించవచ్చని వైద్య సిబ్బంది తెలిపారు. మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సమ్మయ్య, సూపర్‌వైజర్ శ్రీనివాస్, మలేరియా టెక్నికల్ ఆఫీసర్ రాజేష్, హెల్త్ అసిస్టెంట్లు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, ఆశా కార్యకర్త చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు అధికారుల సన్నద్ధం

- స్టేజ్-1 ఎలక్షన్ ఆఫీసర్లకు శిక్షణ..
- నామినేషన్ల స్వీకరణ నుంచి గుర్తుల కేటాయింపు వరకు విధులపై అవగాహన





పొందూరు ,ప్రజాజ్యోతి న్యూస్ : పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు స్టేజ్-1 ఎలక్షన్ ఆఫీసర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పొందూరు మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్. వాసుదేవరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎన్నికల విధులకు సంబంధించి అధికారులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా నామినేషన్ల స్వీకరణ విధానం, అభ్యర్థిత్వాల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ, అభ్యర్థులకు ఎన్నికల గుర్తుల కేటాయింపు తదితర అంశాలపై వివరంగా శిక్షణ అందజేశారు. ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ దుంపల అప్పన్న, పొందూరు సింహాచలం, ఎం. ఓ.టి లు పాల్గొన్నారు.

విద్యార్థులు లైంగిక నేరాలపై పిల్లలు అప్రమత్తంగా ఉండాలి

- బాలలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి. జ్యోత్స్న



పొందూరు ,ప్రజాజ్యోతి న్యూస్:పిల్లలపై జరిగే లైంగిక వేధింపులు, అకృత్యాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ బి. జ్యోత్స్న సూచించారు. బాలల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా పోక్సో చట్టాన్ని రూపొందించిందని, ఈ చట్టం ద్వారా బాలలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బాలల దినోత్సవం నేపథ్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలపై జరిగే లైంగిక వేధింపులు, అకృత్యాలను అరికట్టడంతో పాటు వారికి రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం అమల్లో ఉందన్నారు.పిల్లలపై శారీరకంగా, మానసికంగా వేధింపులకు పాల్పడినా, లైంగిక దాడులకు యత్నించిన నిందితులపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. పిల్లలు స్వేచ్ఛగా జీవించే హక్కును హరించేలా ప్రవర్తించే వారిని చట్టం కఠినంగా శిక్షిస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు తమపై ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది ఎం. రాము, న్యాయవాది టి. సంతోష్ కుమార్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం బి. సుజాత, పొందూరు ఎంఈఓ-2 పట్నాన రాజారావు, ఏఎస్ఐ జి. త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండిఓ ఎ రాజు ఆధ్వర్యములో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆర్ఓలు, పంచాయతీ అభివృద్ధి అధికారులకు శిక్షణ.



ఆలమూరు, నవంబర్ 12 (ప్రజాజ్యోతి):గ్రామ పంచాయతీ ఎన్నికలు--2026 నిర్వహణ ప్రక్రియలో భాగంగా ఎండిఓ ఎ రాజు ఆధ్వర్యములో ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నికల విధులపై అధికారులకు ఎంఓటి ఏ శ్రీనివాసరావు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్టేజ్--1 రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు) ఏడుగురుకి శిక్షణ అందించారు. అనంతరం మధ్యాహ్నం స్టేజ్--2 20 మంది రిటర్నింగ్ అధికారులతో పాటు 18 మంది పంచాయతీ అభివృద్ధి అధికారులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధవిధానాలు, అధికారుల బాధ్యతలు, ఎన్నికల ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనలు, విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులను సన్నద్ధం చేసే ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

బాపట్లలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు కలెక్టర్ కసరత్తు



బాపట్ల నవంబర్ 12 (ప్రజా జ్యోతిజిల్లా ప్రతినిధి) పట్టణ ప్రజలకు మెరుగైన క్రీడా సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడంపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఇందులో భాగంగా బాపట్లలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి అనువైన స్థలాల ఎంపిక ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ గురువారం చేపట్టారు. పట్టణంలోని పలు విద్యాసంస్థల ప్రాంగణాలను సందర్శించి అందుబాటులో ఉన్న స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మున్సిపల్ హైస్కూల్, సి.ఎస్.ఎస్.ఎన్.ఎం.ఎం. ప్రాథమిక పాఠశాల ఆవరణల్లో స్థల విస్తీర్ణం, నిర్మాణానికి అనుకూలత, అవసరమైన మౌలిక వసతులపై అధికారులతో సమీక్షించారు. స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు సంబంధించి స్థల ఎంపికతో పాటు ఇతర సదుపాయాల కల్పనపై పలు సూచనలు చేశారు. ప్రజలకు వినోదంతో పాటు క్రీడా కార్యకలాపాలకు ఉపయోగపడేలా ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పరిశీలన సాగింది.కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ సింగ్, మున్సిపల్ కమిషనర్ ఎం. హోసిని, డీఎస్‌డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వేగేశన



బాపట్ల నవంబర్ 12 (ప్రజాజ్యోతిజిల్లా ప్రతినిధి)ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలతో శ్రీ శ్రీ శ్రీ నాగేంద్ర స్వామి ఆలయ పదో వార్షిక ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.హైవే సమీపంలోని ఆలయంలో జరిగిన ఈ వార్షికోత్సవానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు వేడుకలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.

4వ వార్డు బీజేపీ కౌన్సిలర్ మొండ్ల మహాలక్ష్మి ని మర్యాద పూర్వకంగా కలిసిన వార్డు సచివాలయ సిబ్బంది



గుంతకల్లు నవంబర్ 12 (ప్రజా జ్యోతి): ఇటీవలే గుంతకల్లు పురపాలక సంఘం (మున్సిపాలిటీ) ఎన్నికలలో 4వ వార్డ్ బిజెపి కౌన్సిలర్ గా మొండ్ల మహాలక్ష్మి గెలుపొందడంతో 4 వ వార్డు సచివాలయ సిబ్బంది కౌన్సిలర్ మహాలక్ష్మి ని, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు మొండ్ల కేశవ ని మర్యాదపూర్వ కంగా కలిసి శాలువాల వేసి, పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాపట్ల మున్సిపల్ ఎన్నికల్లో స్థానికులకే కాంగ్రెస్ ప్రాధాన్యం

పార్టీ కోసం పనిచేసిన వారికి కౌన్సిలర్, చైర్మన్ అభ్యర్థులుగా అవకాశం. ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గంట అంజిబాబు



బాపట్ల నవంబర్ 12 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి) ఎక్కడో ఇతర ప్రాంతాల నుంచి నాయకులను తీసుకొచ్చి బాపట్ల మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి నిలబెట్టడం కంటే, స్థానికంగా నివసిస్తూ ప్రజల సమస్యలపై అవగాహన ఉన్నవారికే కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గంట అంజిబాబు స్పష్టం చేశారు. బాపట్ల పటేల్ నగర్‌లోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో 44 వార్డులకు కాంగ్రెస్ పార్టీ తరఫున కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిని ప్రకటిస్తామని వెల్లడించారు.ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని, పదవుల కోసం ఇతర పార్టీల వైపు వెళ్లకుండా పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పిస్తామని తెలిపారు. స్థానికేతరులను తీసుకొచ్చి పోటీకి నిలబెట్టడం వల్ల ప్రజలకు సమస్యలు వచ్చినప్పుడు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికంగా అందుబాటులో ఉండే నాయకులే ప్రజలకు మెరుగైన సేవలందించగలరని పేర్కొన్నారు. అందుకే బాపట్లకు చెందిన స్థానికులకే, పార్టీ కోసం కష్టపడిన వారికే అభ్యర్థులుగా అవకాశం కల్పించాలన్నది కాంగ్రెస్ పార్టీ ఉద్దేశమని తెలిపారు. మరో నాలుగు రోజుల్లో అభ్యర్థుల ఎంపికపై స్పష్టత ఇస్తామని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రతి వార్డులో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేసి, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా స్వీకరిస్తామని అంజిబాబు వివరించారు. ఆ ఫిర్యాదులను గెలుపొందిన కౌన్సిలర్ల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వేమూరు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తాడికొండ వెంకటేశ్వరరావు, బాపట్ల పట్టణ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజ్, ఎస్వీఆర్ కుమార్, చింతా బాబురావు, తాజుద్దీన్, శీలం సాగర్, రవి, నజీర్, అమనుల్లా,

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ



బాపట్ల నవంబర్ 12 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి) జిల్లాలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది.జిల్లాలో మూడు విడతల్లో 351 గ్రామపంచాయతీల పరిధిలోని 3,662 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం 156 నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్న స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఇతర సిబ్బందికి ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి టి. నగేష్ కుమారి మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలని, కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బంది శిక్షణకు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు.

డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే పదవులకు రాజీనామా చేస్తా!

ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి సూర్యనారాయణ రెడ్డి బహిరంగ సవాల్



బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 12 (ప్రజా జ్యోతి) బద్వేల్ మున్సిపాలిటీ , ఎంపీటీసీ, జెడ్పీటిసి ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన వారి నుండి నేను డబ్బులు తీసుకున్నట్లు ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ఆరోపిస్తున్నారని, వారి నుండి నేను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే నా డీసీసీబి పదవికి,టిడిపి ఇంచార్జ్ పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి సూర్యనారాయణ రెడ్డి సవాల్ విసిరారు. మీరు చేస్తున్న ఆరోపణలు నిరూపించకపోతే కుటుంబ సభ్యులతో దేవుని దగ్గర ప్రమాణానికి సిద్ధం కావాలన్నారు. నేను కూడా మా కుటుంబ సభ్యులతో ప్రమాణానికి సిద్ధంగా ఉన్నానన్నారు. గురువారం ఎన్జీవో కాలనీలోని టీడీపీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నికైనటువంటి కౌన్సిలర్లు, ఎంపీటీసిలు, జెడ్పిటిసి లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గోవిందరెడ్డి కి రాజకీయ బిక్ష పెట్టిన శివరామకృష్ణ రావుకు వెన్నుపోటు పొడిచారన్నారు.నేను ఎవరికీ వెన్నుపోటు పొడచ లేదని, వీరారెడ్డి కుటుంబం అంటే ఎప్పటికీ నాకు గౌరవమేనని తెలుగుదేశం పార్టీ ఆదేశిస్తే విజయమ్మ, రితేష్ రెడ్డిల కింద పనిచేయడానికి నేను సిద్ధంగా ఉన్నానన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు బద్వేల్ మున్సిపల్ చైర్మన్ గా ఒక కాంట్రాక్టర్ కు పదవి ఇచ్చావని అతని దగ్గర ఎంత డబ్బులు తీసుకుని ఆ పదవి అతనికి ఇచ్చావని ప్రశ్నించారు.అప్పటి ప్రభుత్వంలో బద్వేల్ మున్సిపాలిటీ అభివృద్ధికి 130 కోట్లు కేటాయించిన టెండర్ ను,35 నుంచి 40 కోట్లు పనులు కూడా చేయకుండా డబ్బులలో వాటాల కోసం అభివృద్ధికి ఆటంకాలు కలిగించింది మీరు కాదా అన్నారు.తెలుగుదేశం పార్టీలో సీనియర్లకు ,విద్యావంతులకు, ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న నాయకులకు, వారి కుటుంబ సభ్యులకు మాత్రమే కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు గా అవకాశం ఇచ్చామన్నారు. మీలాగా పదవుల ను అమ్ముకోవడం,డబ్బులు ఉంటేనే రాజకీయాలలోకి రమ్మ నడం, అలాంటి వ్యక్తిత్వం నాది కాదన్నారు. 2029 ఎన్నికలలో బద్వేల్ లో టిడిపి జెండా ఎగరబోతుందన్నారు బద్వేల్‌లోని ఏక చక్రాధిపత్యానికి తెరదించబోతున్నామన్నారు. గోవిందరెడ్డికి మతిభ్రమించి ఇలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మున్సిపల్ చైర్మన్ దివ్య తేజ మాట్లాడుతూ ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి రాజకీయాలలో ఎంతో అనుభవం ఉండి కూడా సూర్యనారాయణ రెడ్డి పై ఇలాంటి ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. బద్వేల్ మున్సిపాలిటీ రిజర్వేషన్ అన్ రిజర్వుడ్ వచ్చినా కూడా ఒక బీసీ మహిళగా మున్సిపల్ చైర్మన్ పదవికి నన్ను ఎంపిక చేయడం సూర్యనారాయణ రెడ్డి గొప్ప మనసుకు నిదర్శనం అన్నారు. మేము పార్టీకి గాని ,సూర్య నారాయణ రెడ్డికి గాని, ఒక్క రూపాయి కూడా ఎవ్వరికీ ఇవ్వ లేదన్నారు. పోరుమామిళ్ల జడ్పిటిసి హబీవున్నిషా మాట్లాడుతూ వీరారెడ్డి కుటుంబం వల్లే మేము రాజకీయంగా ఈ స్థానంలో ఉన్నామన్నారు. వైసీపీ వారి తప్పిదాల వల్ల ఏకగ్రీవాలు అయ్యాయన్నారు.మేము ఎవరికీ డబ్బులు ఇవ్వలేదన్నారు. గోవిందరెడ్డి సూర్యనారాయణ రెడ్డి పై నిరాధారణ ఆరోపణలు చేసి ఆయన హుందాతనాన్ని పోగొట్టుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ఆయన అసత్య, అపోహ మాటలు మానుకొని హుందాతనాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలు.. పల్లెల్లో ఎన్నికల వేడి



(ప్రజా జ్యోతి న్యూస్) నవంబర్ 12 ప్యాపిలి: పంచాయతీ ఎన్నికల నగారా ఇంకా మోగకముందే ప్యాపిలి మండలంలోని పల్లెల్లో ఎన్నికల వేడి మొదలైంది. సర్పంచి పీఠం దక్కించుకోవాలనే ఆశతో ఆశావహులు ఇప్పటి నుంచే ప్రచారంలోకి దిగారు. గ్రామాల్లో టీ స్టాళ్లు, రచ్చబండల వద్ద ఎన్నికలపైనే చర్చలు సాగుతున్నాయి. ఎవరు పోటీ చేస్తారు, ఎవరికి ప్రజాబలం ఉంది, ఏ కుటుంబం నుంచి అభ్యర్థి వస్తారన్న దానిపైనే గ్రామస్తులు ఆసక్తిగా మాట్లాడుకుంటున్నారు.గతంలో గ్రామ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన కుటుంబాలతో పాటు, యువ నాయకులు సైతం సర్పంచి పదవిపై ఆసక్తి చూపుతున్నారు. తమకున్న పలుకుబడి, సామాజిక సమీకరణాలను అంచనా వేసుకుంటూ పావులు కదుపుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత రిజర్వేషన్లు, రాజకీయ మద్దతు, గ్రామ పెద్దల నిర్ణయాల ఆధారంగా అసలు సమీకరణాలు మారే అవకాశం ఉంది. ప్రస్తుతం పల్లెల్లో మొదలైన ఈ ఎన్నికల వేడి రానున్న రోజుల్లో మరింత పెరగనుంది.

వేగేశ్వరపురం సర్పంచ్ బరిలో తైలం పోశారావు కుమార్తె సత్యాదేవి





తాళ్లపూడి, నవంబర్ 12, ప్రజాజ్యోతి న్యూస్ తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామ సర్పంచ్ పదవి జనరల్ మహిళకు కేటాయించడంతో సర్పంచ్ అభ్యర్థిగా తైలం పోశారావు కుమార్తె తైలం సత్యాదేవి బరిలో నిలవనున్నారు. ఆమె విద్యావంతురాలు, యువతి కావడంతో గ్రామంలో ఆమె అభ్యర్థిత్వంపై విశేష ఆసక్తి నెలకొంది. చదువుకున్న యువతి సర్పంచ్ అయితే గ్రామం అభివృద్ధి చెందుతుందని గ్రామస్తులు భావిస్తున్నట్లు సమాచారం.పోశారావు గ్రామంలో ప్రతి వ్యక్తికి అందుబాటులో ఉండే మనిషిగా పేరు తెచ్చుకున్నారని గ్రామస్తులు చెప్పుకుంటున్నారు. కష్టంలో ఉన్నవారికి తనకు తోచినంత చేయూతనిస్తూ ప్రతి ఒక్కరిని ఆదుకుంటారని గ్రామస్తులు అంటున్నారు.గతంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పోశారావు త్రిముఖ పోటీలో ఓటమి పాలైనప్పటికీ ఆ కుటుంబం గ్రామ ప్రజలను వీడలేదని ప్రజలతోనే ఉంటూ సేవ చేస్తూ వస్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.గ్రామంలో ఎక్కువ శాతం యువత ఆమెకే మద్దతుగా ఉన్నట్లు గ్రామస్తుల నుంచి అందుతున్న సమాచారం. యువతతో పాటు పెద్దలు, మహిళలు కూడా ఆమె వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. తండ్రి మంచితనంపై గ్రామస్తులకు ఉన్న నమ్మకం విద్యావంతురాలు, యువత నుంచి లభిస్తున్న మద్దతు ఈ మూడు అంశాలు ఆమెకు అనుకూలిస్తాయా లేదా వేచి చూడాలి

కత్తిపూడిలో వైసీపీకి షాక్.. టీడీపీలో చేరిన 10 కుటుంబాలు

--పసుపు కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



శంఖవరం నవంబర్ 12 (ప్రజా జ్యోతి న్యూస్) శంఖవరం మండలం కత్తిపూడిలో వైసీపీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, మండల జడ్పీటీసీ కంచిబోయిన శ్రీను ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ప్రత్తిపాడులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వ పాలనపై నమ్మకంతో పార్టీలో చేరిన వారికి స్వాగతం పలుకుతూ..కత్తిపూడిలో టీడీపీ బలోపేతానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. టీడీపీలో చేరిన వారిలో వైసీపీ జిల్లా లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ, ప్రముఖ న్యాయవాది కూసుమంచి సూర్యప్రకాశరావు, వైసీపీ నాయకులు కందుకూరి సత్యనారాయణ, కందుకూరి సూరిబాబు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కూసుమంచి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ.. వైసీపీలో తమకు తగిన గుర్తింపు లభించలేదని, ఇటీవల తరచూ పార్టీలు మారే ఓ వ్యక్తి అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నప్పటికీ పార్టీ పెద్దలు స్పందించకపోవడం బాధ కలిగించిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రత్తిపాడు వైసీపీ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు దృష్టికి తీసుకెళ్లినా ఖండించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. మరోవైపు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ వెన్నా లక్ష్మీబాబు, టౌన్ టీడీపీ అధ్యక్షులు కేళంగి జన, కొయ్యా రమణ, గాబు శివ, రౌతు శివ ఆలపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మీ ఇంట బిడ్డగా వస్తున్నా ఆశీర్వదించి గెలిపించండి

సురభి గ్రామ సర్పంచ్ అభ్యర్థి చాలపతి. నాగ మల్లయ్య



చక్రాయపేట , నవంబర్ 12, (ప్రజాజ్యోతి న్యూస్) : సురభి గ్రామంలో గడిచిన కొన్నేళ్ళుగా పెత్తందార్ల పాలనలో సురభి గ్రామ పంచాయతీ కొనసాగడం వల్ల అవినీతిమయంగా మారిందని, వీటి ప్రక్షాళనకు, అవినీతి రహిత పాలనకు తనకు మద్దతు ఇవ్వాలని సర్పంచ్ అభ్యర్థి చాలపతి. నాగ మల్లయ్య గారు కోరారు . మన సురభి గ్రామంలో గత కొన్ని ఏళ్ళుగా పంచాయతీ పాలన సాగించిన నాయకులు వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకుని, గ్రామాన్ని అభివృద్ధిలో కుంటుపరిచారని విమర్శించారు. ఇప్పటికే తాను సమాచార హక్కు చట్టం ద్వారా పంచాయతీలో జరిగిన అవినీతిని ఒక సామాజిక కార్యకర్తగా వెలికితీసి, అంచలంచెలుగా నిరోధించగలిగామన్నారు. నన్ను గ్రామ సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసి, పేద, మధ్య తరగతి కుటుంబాల ఆశయాలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తామన్నారు. ఇప్పటి వరకు ఎన్నడూ సురభి లోని ప్రజలకు పంచాయతీ ఆదాయ, వ్యయాలపై మన పాలకులు ఏనాడు కనీస సమాచారం కూడా ఇప్పటి వరకు ప్రజలకు వెల్లడించలేదన్నారు. ఇప్పటికీ గ్రామంలో తాగునీటి ఇక్కట్లు, డ్రైనేజీ వ్యవస్థ లోపం, పైపులైన్లు, ముఖ్యంగా రోడ్లు అధ్వాన్న స్థితికి చేరుకున్నప్పటికి ఇదిగో, అదిగో అనడం మినహాయించి పెత్తందార్లు పట్టించుకున్న దాకలాలు లేవన్నారు . కానీ తనను సర్పంచ్ గా గెలిపిస్తే ప్రతీ ఆరు నెలలకోసారి పంచాయతీ ఆదాయ, వ్యయాలపై సోషల్ ఆడిట్ చేసిన నివేదికలను కరపత్రాలు ముద్రించి, ప్రతీ రామాలయం వద్ద, చర్చిల వద్ద, ముఖ్య కూడళ్ళ వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. పంచాయతీ గ్రామసభలను పార్టీ కార్యకర్తలు, ఇతరులతో కాకుండా గ్రామానికి చెందిన ప్రజల సమక్షంలో పూర్తి పారదర్శకంగా పంచాయతీలో నిర్వహించి, వారి విలువైన సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మన సురభి గ్రామం పెత్తందార్లకు ఎన్నో విలువైన పదవులు ఇచ్చింది. మన గ్రామం మాత్రం ఇప్పటికీ వెనుకబడే ఉందని, ఇప్పటికైనా ప్రజలు విజ్ఞతతో ఆలోచన చేసి, మీలో ఒకరినైన, సామాన్యుడు అయినా తనను సర్పంచ్ గా గెలిపించాలని చాలపతి. నాగ మల్లయ్య గారు కోరారు.

జగ్గవరం క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సై వి, వెంకట్రావు ప్రత్యేక వాహన తనిఖీలు!

ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్‌పై పోలీసుల హెచ్చరికలు డ్రైవింగ్ లైసెన్స్,

హెల్మెట్ తప్పనిసరి.. రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన







కూనవరం, నవంబర్ 12 (ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కూనవరం ఎస్ఐ వి. వెంకట్రావు జగ్గవరం క్రాస్‌రోడ్డు వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తూ ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడితే ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. అనంతరం టేకుబాక గ్రామంలో యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..



హైదరాబాద్: వరుస తుపాన్ల ప్రభావం నుంచి ఆంధ్రప్రదేశ్, ఒడిశా తీర ప్రాంతాలు ఇప్పుడిప్పుడే కోలుకుంటుండగా.. బంగాళాఖాతంలో మరో వాతావరణ వ్యవస్థ ఏర్పడే సూచనలు ఆందోళన కలిగిస్తున్నాయి. దక్షిణ అండమాన్ సముద్రం పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నవంబర్ 13 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. ఇది మరింత బలపడి నవంబర్ 14 నాటికి తీవ్ర అల్పపీడనంగా, 15 నాటికి వాయుగుండంగా మారే అవకాశముంది. అయితే ఇది తుపానుగా మారుతుందా? ఏ దిశగా పయనిస్తుంది? ఎక్కడైనా తీరం దాటుతుందా? అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

నవంబర్ 15న వాయుగుండంగా మారే ఛాన్స్

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నవంబర్ 12న విడుదల చేసిన తాజా బులెటిన్ ప్రకారం.. దక్షిణ అండమాన్ సముద్రం, పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది నవంబర్ 14 నాటికి మరింత బలపడి, నవంబర్ 15 నాటికి దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య ప్రాంతాల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం ఉత్తర దిశగా కదులుతూ మరింత బలపడే సూచనలున్నాయి. అయితే దీని తీవ్రత, ప్రయాణ మార్గంపై వివిధ వాతావరణ నమూనాల మధ్య భిన్నమైన అంచనాలు ఉన్నాయని ఐఎండీ పేర్కొంది.

ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనాల ప్రకారం.. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, గాలుల అనుకూలత కారణంగా ఈ వ్యవస్థ తుపానుగా మారే అవకాశాన్ని కొట్టిపారేయలేం. ఒకవేళ తుపానుగా రూపాంతరం చెందితే దీనికి ఇరాన్ సూచించిన 'అక్వాన్' అనే పేరు పెట్టనున్నారు.

ఏపీ, తమిళనాడు తీరాల వైపు పయనం?

వాతావరణ నమూనాల ప్రకారం ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తీరాల వైపు కదిలే అవకాశం ఒకటిగా కనిపిస్తోంది. మరో అంచనా ప్రకారం నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించి దిశ మార్చుకుని సముద్రంలోనే తిరోగమించవచ్చు. మయన్మార్ తీరం వైపు వెళ్లే అవకాశాన్ని కూడా కొన్ని నమూనాలు సూచిస్తున్నాయి. అయితే ఏ మార్గంలో పయనిస్తుందనే విషయంలో ఇప్పటికీ ఏకాభిప్రాయం లేదు. తుపానుగా మారడం, తీరం దాటడం వంటి అంశాలపై అధికారిక నిర్ధారణ వచ్చే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు.

ూనిఎఎవే ఔషష్ట్రవతీం1

దక్షిణాది రాష్ట్రాలకు వర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనంతో దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశముంది. ఐఎండీ తాజా అంచనాల ప్రకారం:

- ఆంధ్రప్రదేశ్, యానాం: నవంబర్ 14 నుంచి 16 వరకు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంది.
- తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్: నవంబర్ 12 నుంచి 14 వరకు అక్కడక్కడా వర్షాలు, నవంబర్ 15న విస్తృత ప్రాంతాల్లో వర్షాలు కురిసే సూచనలున్నాయి. నవంబర్ 16న కూడా వర్షాలు పడవచ్చు.
- కేరళ, మాహే: నవంబర్ 15 వరకు అక్కడక్కడా వర్షాలు, 16న విస్తృత ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది.
- రాయలసీమ: నవంబర్ 14 నుంచి 16 వరకు అక్కడక్కడా వర్షాలు పడొచ్చు.
- అండమాన్ నికోబార్ దీవులు: నవంబర్ 12 నుంచి 18 వరకు విస్తృతంగా వర్షాలు కురిసే సూచనలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కూడా పడవచ్చు.

తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల ప్రభావం ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

మత్స్యకారులకు అప్రమత్తత సూచనలు

బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడే క్రమంలో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉంది. నవంబర్ 14, 15 తేదీల్లో అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచి, గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవచ్చని ఐఎండీ అంచనా వేసింది. సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లోని మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.

హిమాలయ ప్రాంతాల్లో వర్షాలు, మంచు

మరోవైపు పశ్చిమ విక్షోభం ప్రభావంతో జమ్మూ కశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్ ప్రాంతాల్లో వర్షాలు, ఎత్తయిన పర్వత ప్రాంతాల్లో మంచు కురిసే అవకాశముంది. ఉత్తరాఖండ్‌లోనూ అక్కడక్కడా వర్షాలు పడొచ్చు. అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ ప్రాంతాల్లో కూడా నవంబర్ 12 నుంచి 17 మధ్య వర్ష సూచనలు ఉన్నాయి.

ఉత్తరాదిలో ఇంకా మొదలుకాని చలి తీవ్రత

నవంబర్ రెండో వారం కొనసాగుతున్నప్పటికీ ఉత్తర, మధ్య భారతదేశంలోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత ఆశించిన స్థాయిలో పెరగలేదు. కొన్ని ప్రాంతాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు ఇంకా అధికంగానే నమోదవుతున్నాయి. అయితే హిమాలయ ప్రాంతాల్లో వాతావరణ మార్పులు, పశ్చిమ విక్షోభాల ప్రభావంతో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

మొత్తంగా.. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఏపీ, తమిళనాడు తీర ప్రాంతాల ప్రజలు వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనిస్తూ ఉండాలి. ప్రస్తుతానికి తుపాను తీరం దాటే ప్రాంతంపై ఎలాంటి తుది నిర్ధారణ లేదు.

రసూల్‌పల్లిలో ప్రజలకు అవగాహన కల్పించిన సీకే దిన్నె పోలీసులు



చింత కొమ్మ దిన్నె ప్రజాజ్యోతి 12/11/26 సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో చింతకొమ్మదిన్నె మండలం రసూల్‌పల్లి గ్రామ ప్రజలతో సీకే దిన్నె సి ఐ బాలమద్దిలేటి ఎస్ ఐ శ్రీనువాలు రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలకు, ఘర్షణలకు తావివ్వకుండా గ్రామంలో శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలందరూ సోదరభావంతో మెలగాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతియుత ఎన్నికల నిర్వహణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

జామ తోటల్లో సూక్ష్మపోషకాల వినియోగంపై రైతులకు అవగాహన



చింత కొమ్మ దిన్నె ప్రజాజ్యోతి 12/11/26 కడప: జామ తోటల్లో సూక్ష్మపోషకాల వినియోగం, జీవ శిలీంధ్రనాశినుల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఏరువాక కేంద్రం, కడప వారు వ్యవసాయ శాఖ సమన్వయంతో కడప జిల్లా మైలవరం మండలం తాళ్లమంచిపట్నం గ్రామంలో రైతు సంక్షేమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎన్. కృష్ణప్రియ రైతులతో కలిసి గ్రామంలోని జామ తోటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా జామ పంటలో సూక్ష్మపోషకాల ప్రాముఖ్యత, వాటి లోపం వల్ల కలిగే సమస్యలను వివరించారు. సరైన సమయంలో సూక్ష్మపోషకాలను వినియోగించడం ద్వారా పంట ఎదుగుదల, కాయల నాణ్యత, దిగుబడిని పెంచుకోవచ్చని తెలిపారు. అలాగే నేల ద్వారా వ్యాపించే శిలీంధ్ర తెగుళ్ల నివారణకు జీవ శిలీంధ్రనాశిని ట్రైకోడెర్మా వినియోగం, దాని ప్రాముఖ్యత, ఉపయోగించే విధానాలను రైతులకు వివరించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి గురు భాస్కర్ మాట్లాడుతూ జామ తోటల్లో నీటి ద్వారా ఎరువులను అందించే పద్ధతిని పాటించడం వల్ల ఎరువులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు నీటిని ఆదా చేయవచ్చని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల బందోబస్తులో సమర్థ్ యాప్ కీలకం. ఎస్పీ ఉమామహేశ్వర్



బాపట్ల నవంబర్ 12 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి) ఎన్నికల విధుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకునేందుకు బాపట్ల జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పోలీస్ సిబ్బందికి సమర్థ్ మొబైల్ యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ అందించారు. ఎన్నికల సమయంలో సమాచార మార్పిడి వేగవంతం చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు ఈ యాప్ ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు.ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం బాపట్లలోని ఎస్పీ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఐటీ కోర్ బృందం శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ ద్వారా అత్యవసర సమాచారం పంపడం, సమీపంలోని పోలీస్ బృందాల కదలికలను గూగుల్ మ్యాప్స్ ద్వారా గుర్తించడం, ఘటనలకు సంబంధించిన వీడియోలను ఉన్నతాధికారులకు పంపించే విధానాలను ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ వి. సూర్యనారాయణ, ఎస్ఐ ఎ. నాగేశ్వరరావు ప్రత్యక్ష ప్రదర్శనతో వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమర్థ్ యాప్ ద్వారా విధుల్లో ఉన్న పోలీసుల స్థానాన్ని రియల్ టైమ్‌లో పర్యవేక్షించడంతో పాటు, సిబ్బంది మధ్య సమన్వయం పెరుగుతుందని పేర్కొన్నారు. గతంలో మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఈ యాప్‌ను వినియోగించామని, రానున్న గ్రామపంచాయతీ, బాపట్ల మున్సిపల్ ఎన్నికల్లోనూ విస్తృతంగా ఉపయోగించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే చీరాల, రేపల్లె సబ్ డివిజన్లలో శిక్షణ పూర్తి చేయగా, తాజాగా బాపట్ల సబ్ డివిజన్ పోలీసులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ సీహెచ్. చంద్రమౌళి, ఐటీ కోర్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శత్రువుకు కోలుకునే అవకాశం ఇవ్వొద్దు..

న్యూఢిల్లీ: మారుతున్న ప్రపంచ యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా భారత త్రివిధ దళాలు తమ రక్షణ, దాడి సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. శత్రువుకు కోలుకునేందుకు, ప్రతిస్పందించేందుకు అవకాశం ఇవ్వకుండా సమర్థవంతంగా ఎదురుదాడి చేసే సామర్థ్యాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో శత్రువుల నుంచి ఎదురయ్యే ఆకస్మిక దాడులను ముందుగానే గుర్తించి తిప్పికొట్టేలా నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన భారత వైమానిక దళ (ఐఏఎఫ్) కమాండర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక యుద్ధ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, భవిష్యత్ రక్షణ వ్యూహాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై కీలక సూచనలు చేశారు.

సంపాదకీయం

అమెరికా టార్గెట్‌గా హానీట్రాప్

చిప్ తయారీ దిగ్గజం ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ చుట్టూ వివాదం మరింత ముదురుతోంది. చైనా గూఢచర్య కార్యకలాపాలతో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న అలిస్ హువాంగ్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయన్న ఆరోపణలపై సంస్థ స్వతంత్ర దర్యాప్తు ప్రారంభించింది. ఇందుకోసం ప్రముఖ అమెరికా న్యాయ సంస్థ వాచెల్, లిప్టన్, రోసెన్ అండ్ కట్జ్‌ను నియమించింది. మరోవైపు ఉద్యోగులతో జరిగిన అంతర్గత సమావేశంలో తన వ్యక్తిగత తప్పిదాన్ని అంగీకరించి, కుటుంబానికి కలిగించిన బాధకు హువాంగ్ క్షమాపణలు చెప్పినట్లు సమాచారం.గతంలో ఓపెన్‌ఏఐ, సేల్స్‌ఫోర్స్ వంటి దిగ్గజాల తరపున వాదించిన ఈ న్యాయసంస్థ, హువాంగ్ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు జరపనుంది. ఆర్థిక మోసాలు, క్రిమినల్ కేసులను వాదించడంలో అపార అనుభవం ఉన్న న్యూయార్క్ సదరన్ డిస్ట్రిక్ట్ మాజీ అటార్నీ జూన్ కిమ్ ఈ దర్యాప్తునకు నేతృత్వం వహించనున్నారు. గతంలో ఆయన న్యూయార్క్ సదరన్ డిస్ట్రిక్ట్‌లో తాత్కాలిక ఫెడరల్ అటార్నీగా పనిచేశారు. పెద్ద సంస్థలకు సంబంధించిన క్లిష్టమైన న్యాయపరమైన వ్యవహారాలు, దర్యాప్తుల్లో ఈ న్యాయ సంస్థకు అనుభవం ఉంది. 2021లో అప్పటి న్యూయార్క్ గవర్నర్ ఆండ్రూ క్యూమోపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై జరిగిన విచారణలోనూ కిమ్ కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు హువాంగ్ వ్యవహారంలోనూ స్వతంత్రంగా అన్ని అంశాలను పరిశీలించనున్నారు.ఎన్విడియా స్వతంత్ర డైరెక్టర్లతో కూడిన కమిటీ విచారణను పర్యవేక్షించనుంది. జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలు, సంస్థ రహస్యాలు బయటకు వెళ్లినట్లు ప్రస్తుతం తమ వద్ద ఆధారాలు లేవని ఎన్విడియా ఇప్పటికే స్పష్టం చేసింది. అయినప్పటికీ అందుబాటులో ఉన్న సమాచారాన్ని బోర్డు సమగ్రంగా పరిశీలిస్తుందని తెలిపింది. ఈ విచారణకు హువాంగ్ పూర్తిగా సహకరిస్తారని వెల్లడించింది. ఇదే అంశంపై అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ కూడా విచారణ జరుపుతోంది. ఈ దర్యాప్తులో భాగంగా అలిస్ హువాంగ్‌ను విచారించే అవకాశం ఉందా లేదా అన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు.'ది న్యూయార్క్ టైమ్స్' కథనం ప్రకారం, ఆలిస్ హ్వాంగ్ అనే చైనా వ్యాపారవేత్త.. చైనా తరపున గూఢచర్యానికి పాల్పడుతున్నారని అమెరికా నిఘా అధికారులు అనుమానిస్తున్నారు.ఎన్విడియా సీఈఓ, దాని సహ వ్యవస్థాపకుడైన జెన్సన్ హ్వాంగ్‌తో ఆలిస్‌కు సన్నిహిత సంబంధం ఉందని అధికారులు భావిస్తున్నారు.హ్వాంగ్ తన భార్యకు నమ్మకద్రోహం చేసినట్లు అంగీకరించి, భార్యకు, పిల్లలకు క్షమాపణలు చెప్పారు.ఈ కథనాలపై ఎన్విడియా ఒక స్వతంత్ర దర్యాప్తును ప్రారంభించింది. అయితే, దీనివల్ల అమెరికా జాతీయ భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లలేదని ఆ సంస్థ పేర్కొంది.ఈ విషయంపై ఎఫ్‌బీఐ కూడా దర్యాప్తు చేస్తోందని అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ తెలిపారు. హ్వాంగ్‌తో తాను మాట్లాడినట్లు ట్రంప్ వెల్లడించారు.గూఢచర్యంలో అమెరికాను టార్గెట్‌గా చేసుకున్న చైనా ఇందుకోసం హ్వాంగ్‌ను పావుగా వాడుకున్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి..ది న్యూయార్క్ టైమ్స్' నివేదిక ప్రకారం గూఢచర్యం చేసే ఉద్దేశ్యంతో చైనా అగ్రశ్రేణి గూఢచార సంస్థ ఆలిస్ హ్వాంగ్‌ను నియమించుకుందని అమెరికా అధికారులు భావించారు. ఆమె ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో తెలియదు.ఆలిస్ హ్వాంగ్‌కు జెన్సన్ హ్వాంగ్‌తో ఎలాంటి కుటుంబ సంబంధం లేదు. మార్చి- నవంబర్ 2023 మధ్య ఆమె సింగపూర్‌కు చెందిన డేటా సెంటర్ కంపెనీ మెగాస్పీడ్‌లో ఒక ఉన్నత పదవిని నిర్వహించారు. ఈ సంస్థ చైనాకు ఎన్విడియా చిప్‌ల రవాణాను సులభతరం చేసిందనే అనుమానం ఉండేది. అయితే, ఈ విషయంపై విచారణ జరిపి, ఆ ఆరోపణలు అవాస్తవమని తేలిందని ఎన్విడియా పేర్కొంది.మెగాస్పీడ్‌పై గతంలో వచ్చిన ఆరోపణలపై సింగపూర్ ప్రభుత్వం విచారణ జరుపుతోంది. ఆ ఆరోపణల ప్రకారం, ఉన్నత శ్రేణి ఎన్విడియా చిప్‌లపై అమెరికా విధించిన ఎగుమతి ఆంక్షలను ఆ కంపెనీ తప్పించుకోవడానికి ప్రయత్నించింది. ఈ విషయంపై వ్యాఖ్య కోసం మెగాస్పీడ్‌ను సంప్రదించింది.గత నెలలో, ప్రస్తుత నాయకత్వం ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిందని, అంతర్గత విచారణ జరిపేందుకు న్యాయ సలహాదారులను నియమించిందని ఆ కంపెనీ 'ది న్యూయార్క్ టైమ్స్'కు తెలిపింది.నిఘా పెట్టినప్పుడు ఆలిస్ హ్వాంగ్‌కు ఒక అమెరికా పౌరుడికి మధ్య సంభాషణలు జరిగినట్లు తేలింది. 'అన్‌మాస్కింగ్' అనే ప్రక్రియ ద్వారా పరిశోధించినప్పుడు ఆ వ్యక్తి జెన్సన్ హ్వాంగ్ అని గుర్తించారు.అయితే, హ్వాంగ్ లే అనే మరో పేరు కూడా ఉన్నా ఆలిస్ హ్వాంగ్ ఎలాంటి సమాచారాన్ని సేకరించి బీజింగ్‌కు పంపారు అన్నది స్పష్టంగా తెలియలేదు..అమెరికా గూఢచార అధికారులు లేవనెత్తిన ఆందోళనల గురించి తమ కంపెనీకి తెలుసా అని అడిగినప్పుడు, తమకు అలాంటి సమాచారం తెలియదని ఎన్విడియా ఖండించింది."ఒకవేళ మేం ఏదైనా నిజమైన ముప్పును ఎదుర్కొంటున్నట్లయితే, అమెరికా ప్రభుత్వం మాకు తెలియజేసి ఉండేదని భావిస్తున్నాం" అని ఎన్విడియా ప్రతినిధి బీబీసీతో అన్నారు.మరోవైపు ఈ గూఢచర్యం ఆరోపణలను చైనా తోసిపుచ్చింది. విదేశాంగ శాఖ ప్రతినిధి గ్వో జియాకున్ ఒక మీడియా సమావేశంలో "మేం ఇప్పటికే స్పందించాం. చైనా గూఢచర్యానికి సంబంధించిన ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. ఊహాగానాలపై ఆధారపడినవి. చైనా ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఉద్దేశించినవి" అని అన్నారు.ఆలిస్ హ్వాంగ్ చైనా కోసం గూఢచర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ డోనల్డ్ ట్రంప్‌కు గత సంవత్సరమే నిఘా నివేదికలు అందాయని అక్టోబర్ చివరిలో 'ది న్యూయార్క్ టైమ్స్' కథనం రాసింది.మరోవైపు హ్వాంగ్ గురించి అడిగినప్పుడు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వ్యాఖ్యానించడానికి నిరాకరించారు.హ్వాంగ్ 1980ల ప్రారంభంలో ఒరెగాన్ స్టేట్ యూనివర్శిటీలో తన కాబోయే భార్య లారీ మిల్స్‌ను కలిశాడు. ఆ సమయంలో, వారిద్దరూ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదువుతూ ఒకే ల్యాబ్‌లో పనిచేసేవారు.వారు ఎన్విడియాను సహ-స్థాపించడానికి సుమారు ఎనిమిది సంవత్సరాల ముందు, 1985లో వివాహం చేసుకున్నారు. వారికి మాడిసన్, స్పెన్సర్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు.2007లో, వారిద్దరూ జెహెచ్ అండ్ ఎల్ హ్వాంగ్ ఫౌండేషన్‌ను స్థాపించారు. ఎన్విడియా స్టాక్ ధరలో వేగవంతమైన పెరుగుదల కారణంగా, గత కొన్ని సంవత్సరాలుగా ఈ ఫౌండేషన్ ఆస్తులు గణనీయంగా పెరిగాయి. దీని విలువ 9 బిలియన్ డాలర్లకు పైగా ఉంటుందని అంచనా.ఈ ఫౌండేషన్ ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలలోని ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లకు మిలియన్ల డాలర్లను విరాళంగా ఇచ్చింది.హ్వాంగ్ ఎప్పుడూ తనను తాను ఒక ఫ్యామిలీ మ్యాన్‌గా చూపించుకునేందుకు ప్రయత్నించేవారని హ్వాంగ్ బయోగ్రఫీ రచయిత స్టీఫెన్ విట్ చెప్పారు."ఆయన తన భార్యను పొగుడుతూ ఆమె గురించి చాలా మంచి విషయాలు చెబుతారు. అయితే ఇలాంటి విషయాలు బయటపడితే ఏ కుటుంబానికైనా తీవ్రమైన బాధ కలుగుతుంది. తనను తాను ఒక కుటుంబ పెద్దగా చూపించుకోవడానికి, తన పిల్లలను తన దగ్గర ఉంచుకోవడానికి ఎంతో కృషి చేసిన వ్యక్తిపై ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉండొచ్చు" అని స్టీఫెన్ విట్ చెప్పారు.

ఈసీఐ నేరం ఒప్పుకొన్నా న్యాయం జరిగేనా?

ఓటర్ మహాశయులకు, ముఖ్యంగా ఓటర్ జాబితాల నుంచి పేర్ల తొలగింపు బాధితులకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) దీపావళి కానుక నొకదాన్ని ఇచ్చింది. పండుగకు రెండు రోజుల ముందు జారీ చేసిన ఆదేశంలో-- సర్ ప్రక్రియ అమలు ఇంకా అధికారికంగా పూర్తికాని ఏడు రాష్ట్రాలలోని ఓటర్లకు రాయితీలు కల్పించింది. తద్వారా సర్ వ్యతిరేక ఉద్యమకారులు చేస్తున్న విధానపరమైన డిమాండ్లలో చాలావాటిని ఈసీఐ అంగీకరించింది. సమస్యేమిటంటే ఓటర్ జాబితాల నుంచి పేర్ల తొలగింపునకు గురైన ఓటర్లలో కొద్దిమందికి మినహా అందరికీ దీపావళి డిస్కౌంట్ వోచర్ గడువు ముగిసిపోయింది. నిజం చెప్పాలంటే ఈసీఐ ఆదేశం తన నేరాన్ని అంగీకరించడమే. సర్ పేరిట ఓటర్ జాబితాల నుంచి కోట్లాది ఓటర్ల పేర్లను న్యాయవిరుద్ధంగా తొలగించడమే ఆ అపరాధం. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలు బహిర్గతమవడం దరిమిలా విధానపరమైన అవకతవకల విషయమై ఈసీఐ వైఖరిలో మార్పు చోటుచేసుకున్నది.

ఏడు రాష్ట్రాల-- ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్-- ఎన్నికల ప్రధానాధికారులకు ఈ నెల 6న భారత ఎన్నికల సంఘం రాసిన లేఖ సర్ విషయంలో ఆ రాజ్యాంగ సంస్థ బహిరంగంగా తన నిర్ణయాలను వెనక్కి తీసుకోవడంలో ఒక అత్యంత ముఖ్యమైన ఘట్టం. ఆ ఏడు రాష్ట్రాల ముసాయిదా సర్ ఓటర్ జాబితాల నుంచి పేర్లు తొలగించిన 4.52 కోట్ల మంది ఓటర్లకు అనేక ఉపశమనాలను కల్పించింది. అఖిల భారత స్థాయిలో ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్' కారణాలతో మొత్తం 13.3 కోట్ల మంది పేర్లను తొలగించడం జరిగింది. ఇప్పుడు ప్రస్తావిత ఏడు రాష్ట్రాలలో ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు నిర్దేశించిన గడువును కూడా రద్దు చేశారు. గడువులోగా ఆ ఫారాలను సమర్పించలేకపోయినవారు ఇప్పటికీ వాటిని సమర్పించే వెసులుబాటు ఉన్నది. నివాసం మారినవారు ఫారం--6 సమర్పించడంలో ఉన్న ప్రయాసలకు లోనుకావలిసిన అవసరం లేదు. తమ కొత్త చిరునామా వివరాలను తప్పనిసరిగా తెలియజేయాలి. అలాగే మురికివాడల తొలగింపు వంటి కారణాల వల్ల ఇళ్లు కోల్పోయినవారూ ధ్రువపత్రాల కోసం అధి కారుల చుట్టూ తిరగడం వంటి ప్రయాస పడనవసరం లేదు. బీఎల్‌ఓలే క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదికను సమర్పిస్తే వారి పేర్లను కూడా ఓటర్ల జాబితాలో చేర్చేలా ఈసీఐ వీలు కల్పించింది. ఈసీఐ ఆదేశంలో విస్తృత ప్రభావం చూపే రెండు ఉపసంహరణలు అంతర్భూతంగా ఉన్నాయి. ఇప్పటివరకూ ఓటర్ల జాబితాల నుంచి అన్యాయంగా తొలగించిన ఏ ఓటర్ పేరు అయినా తిరిగి జాబితాలోకి రావడానికి ఒకే ఒక మార్గం ఉందని ఈసీఐ పట్టుబడుతూవచ్చింది. తాను 'కొత్త ఓటర్'నని తప్పుగా ప్రకటించి ఫారం--6 నింపి సమర్పించాలి. సదరు ఓటర్‌కు ఒక కొత్త ఓటర్ ఫొటో గుర్తింపుకార్డు నెంబర్‌ను కేటాయిస్తారు. ఈ నెంబర్‌తోనే జాబితాలో అతడి పేరును చేర్చుతారు. సదరు ఓటర్ల దరఖాస్తులను ఓటర్ల నమోదు నిబంధనలలోని రూల్ 21(1) ప్రకారం అధికారులు పరిశీలిస్తారు. పొరపాటున లేదా అజాగ్రత్తగా వదిలివేసిన పేర్లను చక్కదిద్దేందుకు ఈఆర్‌ఓలు తగుచర్యలు తీసుకుంటారు. మరో మార్పు ఏమిటంటే ఓటర్ జాబితాలలో పేర్లను తిరిగి చేర్చిన వారికి పాత ఓటర్ ఫొటో గుర్తింపుకార్డు నెంబర్‌ను ఇవ్వాలని ఈసీఐ నిర్దేశించింది. ఇది స్వాగతించవలసిన విషయం. ఈ రెండు మార్పులు భారత ఎన్నికల సంఘం వైఖరిలో వచ్చిన మార్పులను స్పష్టం చేస్తున్నాయి.



సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలతో ఈసీఐకి తనపై విమర్శలలో వాస్తవికతను గ్రహించడం అనివార్యమయింది. ఢిల్లీలో సర్ ప్రక్రియ తీరుతెన్నులను ప్రశ్నిస్తూ సమాచార హక్కు కార్యకర్తలు అంజలి భరద్వాజ్, అమృతా జోహ్రి దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా 'ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్' (ఏఎస్‌డీడీ) జాబితాలో ఉన్నవారిని ఫారం 6ను నింపమనడం 'పొరపాటు', 'అసమంజ సత్వం' అవుతుందని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'ఓటర్ జాబితా నుంచి తొలగించిన వ్యక్తులను మళ్లీ ఫారం 6 నింపి కొత్త ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని నిర్దేశించడం తప్పుకాదా? ఒక ఓటర్ తన నివాసాన్ని మార్చుకుంటే ఆ కొత్త చిరునామా వివరాలను మాత్రమే తెలియజేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదు? ఎన్యుమరేషన్ ఫారాలను నిర్దేశిత గడువులోగా సమర్పించలేదని ఓటర్ జాబితాల నుంచి తొలగింపునకు గురైన వ్యక్తులు, ఆ తరువాత అదే ఫారాలను సమర్పించే అవకాశం ఎందుకు ఇవ్వకూడదు?' అంటూ ఈసీఐని నిశితంగా ప్రశ్నించింది. సర్ జాబితా నుంచి తొలగించిన ఏఎస్‌డీడీ కేటగిరీ ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారం లేదా ఫారం--8 ద్వారా ఓటర్ జాబితాలో తమ పేరు తిరిగి నమోదు చేసుకునేందుకు అనుమతించాలని ఈసీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది.

సుప్రీంకోర్టు అభ్యంతరాలు, ఆదేశాలకు ఈసీఐ చురుగ్గా ప్రతిస్పందించలేదు. ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేసింది. పైగా ఒక విడ్డూరమైన వివరణ జారీ చేసింది. సర్ ముసాయిదా జాబితాలో పేరు గల్లంతైనవారు ఫారం--6ను సమర్పించడం ద్వారా తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఈసీఐ స్పష్టం చేసింది. ప్రస్తుతం సాగుతున్న సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల ముసాయిదా జాబితాలో పేరు గల్లంతైనవారు ఫారం--6తో పాటు మొదటిసారి ఓటరుగా నమోదు చేసుకుంటున్నామన్న ధ్రువీకరణ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. 'పాత ఓటర్లు ఫారం--6 సమర్పించినట్టయితే వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 కింద చర్యలు తీసుకోవడం ఉండదు. కేవలం చట్టవిరుద్ధంగా, తప్పుడు ధ్రువీకరణలు ఇచ్చినవారే చర్యలు ఎదుర్కోవలసివస్తుంది' అని కూడా ఈసీఐ తన వివరణలో స్పష్టంగా పేర్కొంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే, మీరు తప్పుడు ధ్రువీకరణలు ఇస్తున్నారన్న వాస్తవం మాకు తెలుసు. అయినప్పటికీ మిమ్ములను నిబంధనల ప్రకారం శిక్షించం అని ఈసీఐ అభయమిచ్చింది!

ఈసీఐ వైఖరిలో మార్పు సర్ వ్యతిరేక ఉద్యమానికి ఒక నైతిక విజయమే. భారత ఎన్నికల సంఘం పాత తరహాలో ప్రతి ఓటరునూ కలుపుకు వెళ్లే సానుకూల వైఖరితో మాట్లాడుతోంది. ఏమైతేనేం, సర్ లోపభూయిష్ఠంగా ఉన్నదన్న వాస్తవాన్ని ఈసీఐ గుర్తించింది, అంగీకరించింది. అయితే సర్ ప్రక్రియ అమలు ఇప్పటికే పూర్తయిన రాష్ట్రాల్లోని ఓటర్లకు ఈ కొత్త విధానాలను ఉపయోగించుకునేందుకు ఎందుకు అవకాశమివ్వడం లేదు? అన్నది జవాబు లేని ప్రశ్న. ఢిల్లీలో కంటే బెంగళూరులోనే ఎక్కువ మంది ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించారు. ఈసీఐ సరికొత్తగా కల్పించిన ఉపశమనాల నుంచి బెంగళూరు ఓటర్లు ఎందుకు లబ్ధి పొందడం లేదు? అసలు సర్ జాబితాల నుంచి పెద్ద ఎత్తున తొలగింపులు జరిగిన ఓటర్ జాబితాల ప్రాతిపదికన అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మాటేమిటి? ఆ రాష్ట్రాలలో సర్ వాస్తవంగా పూర్తయింది. మరి ఆ రాష్ట్రాలలో ఇప్పటికే ఫారం--6ను సమర్పించిన వారికి ఏమి జరిగింది? వారికి వారి పాత ఎపిక్ కార్డు నెంబర్‌ను కేటాయిస్తారా? అసలు ప్రశ్న ఏమిటంటే-- ఆ రెండు రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాలలో పెద్ద ఎత్తున సంభవించిన ఓట్ల తొలగింపును సరిదిద్దేందుకు ఈసీఐ ప్రత్యేక చొరవ తీసుకుంటుందా? లేక ఈ కొత్త ఆదేశాలను కాగితాలకే పరిమితం చేసి, కేవలం కొద్దిమంది ఓటర్లు మాత్రమే తిరిగి జాబితాలోకి వచ్చారని సుప్రీంకోర్టులో ఒక నివేదిక దాఖలు చేస్తుందా?

సర్ ప్రక్రియ అమలు విధానాలలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి, సందేహం లేదు. అయితే సర్ నిర్మాణాత్మక లక్షణాలు యథాతథంగా ఉన్నాయి. ఇవి సార్వత్రిక వయోజన ఓటుహక్కు అనే ప్రజాస్వామిక సూత్రానికి వ్యతిరేకమైనవి. సవరించిన నిబంధనలు సైతం తమ పేరు ఓటర్ జాబితాలలో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యతను ఓటర్ పైనే మోపాయి. ఇది ప్రజాస్వామ్య సూత్రాలకే విరుద్ధం కాదా? పైగా తాము ఈ దేశ పౌరులమని నిరూపించుకోవల్సిన బాధ్యత కూడా ఓటర్లదేనని ఆ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. సవరించిన నిబంధనలు, కల్పించిన ఉపశమనాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చినప్పటికీ, సర్ అప్రజాస్వామిక ధోరణిలో మార్పు ఉండబోదనడంలో కూడా సందేహం లేదు. ఈసీఐ తాత్కాలికంగా వెనక్కి తగ్గినప్పటికీ ఓటర్ల హక్కులను కాలరాస్తున్న లోపభూయిష్ఠ సర్‌ను పూర్తిగా రద్దు చేసేంతవరకు వీధుల్లో ప్రజల ప్రజాస్వామిక పోరాటాలు అనివార్యమవుతాయి. చెప్పవచ్చినదేమిటంటే, ఈసీఐ తన తప్పు ఒప్పుకున్నదిగానీ ఓటర్లకు సంపూర్ణ న్యాయం జరగలేదు. ఓటర్లకు కొత్తగా కల్పించిన ఉపశమనాలు నేరాన్ని అంగీకరించడం మినహా మరేమీ కావు. ఓట్ల తొలగింపు అన్యాయాన్ని అవి పూర్తిగా తొలగించలేవు. ఎందుకంటే సర్ స్వాభావికంగా న్యాయవిరుద్ధమైనది. దానిని పూర్తిగా రద్దు చేసి సరికొత్తగా ప్రారంభించాలి. ఇది మాత్రమే మన ప్రజాస్వామ్య పురోగతికి దోహదం చేస్తుంది.

న్యూఢిల్లీలో ఆర్టిఫిషియల్ రెయిన్

న్యూఢిల్లీ : దేశ రాజధాని దిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు ఐఐటీ కాన్పూర్? కీలక నిర్ణయం తీసుకుంది. దిల్లీలో మరోసారి కృత్రిమ వర్షం (క్లౌడ్ సీడింగ్) సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుత వాతావరణంలో మేఘాలు ఏర్పడటానికి, వర్షం కురవడానికి సరిపడా తేమ ఉందో లేదో అంచనా వేసేందుకు ఈ పరిశీలన జరుగుతోందని ఐఐటీ వర్గాలు తెలిపాయి. అనుకూలమైన తేమ పరిస్థితులను సంస్థ నిర్ధరించుకున్న తర్వాతే ఈ ఆపరేషన్‌పై తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పాయి. ఈ ఆపరేషన్ కోసం విమానం సిద్ధంగా ఉందని, అనుమతులు రాగానే ఇది దిల్లీ నుంచే టేకాఫ్ అవుతుందని అధికారులు వెల్లడించారు.దీపావళి వేడుకల అనంతరం దిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరుకుంది. ఉష్ణోగ్రతలు పడిపోవడం, దట్టమైన పొగమంచు కమ్మేయడంతో కాలుష్య తీవ్రత మరింత పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా వాటర్ స్ప్రింక్లర్లను ఉపయోగించి, సూక్ష్మ కణాల ప్రభావాన్ని తగ్గించడానికి దిల్లీ ప్రభుత్వం కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకుంటోంది. బుధవారం ఉదయం 7 గంటలకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (రికార్డు చేసిన గణాంకాల ప్రకారం దిల్లీలో సగటు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 299 పూర్? కేటగిరీగా నమోదైంది.సగటు మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ, దిల్లీలోని పలు కీలక ప్రాంతాల్లో గాలి నాణ్యత 'అత్యంత అధ్వాన్నం' కేటగిరీలోనే కొనసాగుతోంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకారం, ఛావ్లాలో అత్యధికంగా 396 ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైంది. ఆ తర్వాతి స్థానాల్లో చాందినీ చౌక్ (379), (375), దిల్లీ (375), నార్త్ క్యాంపస్ (374), (367), బురారీ క్రాసింగ్ (362), పూసా (359), నరేలా (352), జాఫర్‌పూర్ (351), ద్వారక (350), మథుర రోడ్ (348), పంజాబీ బాగ్ (341), (339), అయా నగర్ (337), తల్కటోరా గార్డెన్ (331), వివేక్ విహార్ (326), సిరిఫోర్ట్ (321), వజీర్‌పూర్ (321), జహంగీర్‌పురి (320), బురారీ (315), బదర్‌పూర్ (312), ముండ్కా (305), ఆనంద్ విహార్ (304), బావానా (304) ఆర్.కె. పురం (300) ఉన్నాయి.రాజధానిలోని మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత 'పేలవమైన' విభాగంలోనే కొనసాగింది. రోహిణిలో 298, అశోక్ విహార్‌లో 298, ద్వారక-సెక్టార్ 8లో 295, జరోడా కలాన్‌లో 289, ఇగ్నో మైదాన్ గర్హిలో 287, ఎఉఎ విమానాశ్రయం (౦3) వద్ద 282, అలీపూర్‌లో 279, ఉత్తమ్ నగర్‌లో 259 నమోదయ్యాయి. ఈ విభాగంలో లోధి రోడ్ వద్ద అత్యల్పంగా 203 నమోదైంది.ముందుగా శాస్త్రవేత్తలు కృత్రిమ వర్షానికి అనువైన మేఘాలను గుర్తిస్తారు. అందులో సరిపడా తేమ ఉంటుంది. కానీ, వర్షాలు కురిసేందుకు అనువైన పరిస్థితులు ఉండవు. అలాంటి సందర్భంలోనే సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్ లాంటి రసాయన ఉత్ప్రేరకాలను మేఘాలపై చల్లి క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను చేపడతారు. ఇవి మేఘాల్లోని తేమను కరిగించి, వర్షపు బిందువుల రూపంలో కింద పడేందుకు సహకరిస్తాయి. ఇందుకు కొన్ని సార్లు పొడి మంచును కూడా వినియోగిస్తారు. దీనివల్ల మేఘాలు చల్లబడి వర్షం కురిసేందుకు వీలుంటుంది.

ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ హైకమాండ్ సీక్రెట్ సర్వే

న్యూఢిల్లీ : 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 2026 డిసెంబర్ నాటికి ప్రజా పాలనకు మూడేళ్లు పూర్తి అవుతుంది. దీంతో ప్రభుత్వ పనితీరు, ప్రజాప్రతినిధుల వ్యవహారశైలి, పార్టీ క్షేత్రస్థాయి పరిస్థితులపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పథకాల అమలుతోపాటు ప్రజల్లో పార్టీకి ఉన్న ఆదరణ, స్థానికంగా ఎదురవుతున్న సమస్యలు, ఎమ్మెల్యేల పనితీరు వంటి అంశాలను అంచనా వేయడంలో భాగంగా సర్వే చేయనున్నట్లు తెలుస్తోంది. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రులు, ప్రజాప్రతినిధుల పనితీరు ఎలా ఉంది? కాంగ్రెస్? పాలనపై ప్రజాభిప్రాయం ఎలా ఉంది? పరిష్కారం కాని సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఒకవేళ ఉంటే వాటిని ఎందుకు పరిష్కారం చేయలేకపోతున్నారు" అనే తదితర అంశాలపైన వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సర్వేకు సంబంధించిన వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతున్నట్లు పార్టీకి చెందిన ఓ నాయకుడు తెలిపారు.క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ నిర్వహిస్తున్న సర్వేలో ఎమ్మెల్యేల పనితీరుపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో విజయం తర్వాత ఎమ్మెల్యేలు ప్రజలకు ఎంతవరకు అందుబాటులో ఉంటున్నారు? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారు? అభివృద్ధి పనుల పురోగతి ఎలా ఉంది? అనే అంశాలపై ప్రజల అభిప్రాయాన్ని తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. హామీల అమలు, ప్రజలకు అందుబాటులో ఉండే తీరు, అధికారులతో సమన్వయం, స్థానిక సమస్యలపై స్పందన ఆధారంగా ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేయనున్నట్లు తెలుస్తోంది.

"ప్రజల్లో ఎన్నికలకు ముందు ఆయా నాయకులపై ఉన్న ఆదరణకు, ఇప్పుడు ఉన్న అభిప్రాయానికి మధ్య తేడా ఎంత? ఏ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉంది? ఎక్కడ సంతృప్తి ఉంది?" అనే అంశాలపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. "ప్రజలకు ఎమ్మెల్యేలు సమయం కేటాయిస్తున్నారా? అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తున్నారా?" అనే అంశాల్లో వారి పనితీరును అంచనా వేయడంలో ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు సమాచారం.కాంగ్రెస్‌లో అంతర్గత సమన్వయం కూడా మరో కీలక అంశంగా కనిపిస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు ప్రజాప్రతినిధుల వ్యవహారశైలిలో మార్పులు వచ్చాయనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో ఉన్నాయి? సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తోందా? లేక బయట పార్టీల నుంచి వచ్చిన నేతలకు ప్రాధాన్యం ఇస్తున్నారా? అనే అంశాలపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అభ్యర్థుల విజయం కోసం పనిచేసిన స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యేలు ఎలా వ్యవహరిస్తున్నారు? స్థానిక నాయకుల మధ్య సమన్వయం ఉందా? ఎక్కడైనా వర్గ విభేదాలు పార్టీ బలోపేతానికి అడ్డంకిగా మారుతున్నాయా? అనే అంశాలను పరిశీలించే అవకాశం ఉంది.రాష్ట్రంలోని నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, నవంబర్ నెలాఖరుకు సమగ్ర నివేదిక సిద్ధం చేయాలనే లక్ష్యంతో సునీల్ కనుగోలు బృందం పనిచేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ గడువుపై అధికారికంగా స్పష్టత లేదు. డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకోనున్నందున ఈ నివేదికకు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

వరుస దొంగతనాల గుట్టురట్టు!

మూడు ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఇద్దరు అరెస్ట్
29.7 తులాల వెండి ఆభరణాలు, రెండు ఫోన్లు స్వాధీనం
డీఎస్పీ విఠల్ రెడ్డి వెల్లడి

బాన్సువాడ : తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల ఆటకు బాన్సువాడ పోలీసులు చెక్ పెట్టారు. పట్టణంలోని మూడు ఇళ్లలో జరిగిన చోరీ కేసులను ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 29.7 తులాల వెండి ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బాన్సువాడ డీఎస్పీ పి. విఠల్ రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు.

సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు

బాన్సువాడ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో అక్టోబర్ 26న రెండు ఇళ్లలో, నవంబర్ 4న హరిజనవాడలో మరో ఇంట్లో దొంగతనాలు జరిగాయి. అర్ధరాత్రి వేళ ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. బాధితుల ఫిర్యాదులతో పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు డీఎస్పీ విఠల్ రెడ్డి పర్యవేక్షణలో టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి. శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం రంగంలోకి దిగింది. సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

బస్టాండ్ వద్ద చిక్కిన నిందితుడు

నవంబర్ 11న బాన్సువాడ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న జాదవ్ రాహుల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా మూడు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది. దొంగిలించిన సొత్తులో కొంత బోధన్‌కు చెందిన సందీప్‌కు విక్రయించినట్లు, మిగిలిన సొత్తును జుక్కల్ ప్రాంతంలో అమ్మేందుకు వెళ్తున్నట్లు విచారణలో తెలిపాడు.రాహుల్ గతంలోనూ దొంగతనాలకు పాల్పడి జైలు జీవితం గడిపినట్లు పోలీసులు వెల్లడించారు. జల్సాలు, అప్పుల కారణంగా దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో గుర్తించారు.

దొంగ సొత్తు రికవరీ

నిందితుల నుంచి 29.7 తులాల వెండి ఆభరణాలతో పాటు రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన జాదవ్ రాహుల్ (సిద్దాపూర్ తాండ, జుక్కల్ మండలం; ప్రస్తుతం భైంసా), కనోజ్వార్ సందీప్ (49, బోధన్)లను రిమాండ్ నిమిత్తం బిచ్కుంద కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.



పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు

ఈ కేసుల ఛేదనలో టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి. శ్రీధర్, ఎస్ఐ శిరీష, క్లైమ్ టీం హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్, కానిస్టేబుళ్లు పృథ్వీకుమార్, పాండురంగ, సుదర్శన్ రావు కీలకంగా వ్యవహరించారు. వారి కృషిని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అభినందించారు.

సాగు భూమి సంరక్షణ కార్యక్రమం

కేత్ బచావో అభియాన్
ఏవో భాను శ్రీ, ఏఈఓ శిల్ప



కామారెడ్డి : నేల ఆరోగ్య పరిరక్షణ, భూసారాన్ని పెంపొందించడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం లక్ష్యంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నారం గ్రామంలో 'ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి భాను శ్రీ మాట్లాడుతూ...! రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి భూసార పరీక్షలు చేయించుకొని, వాటి ఫలితాల ఆధారంగా సమతుల్యంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. అవసరానికి మించి రసాయన ఎరువులు వాడకుండా, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడం ద్వారా నేల సారాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు, నేలలో సేంద్రియ కర్బనం పెంచడం, పంట మార్పిడి పద్ధతులు పాటించడం, నేలలోని పోషకాలను సమతుల్యంగా నిర్వహించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. రైతులు నేల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ, దీర్ఘకాలంలో అధిక దిగుబడులు సాధించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.వ్యవసాయ విస్తీర్ణాధికారి శిల్ప మాట్లాడుతూ..! వరి పంట కోతల అనంతరం పంటల అవశేషాలను తగలబెట్టకూడదని, వాటిని నేలలో కలియ దున్నడం ద్వారా భూసారం, నేలలోని సేంద్రియ పదార్థాలను పెంపొందించుకోవచ్చని తెలపడం జరిగింది. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని మిత్ర పురుగులు మరియు సూక్ష్మజీవులు నశించి పంట దిగుబడి తగ్గుతుందని వివరించడం జరిగింది. ప్రతి సీజన్ ఒకే రకమైన పంట కాకుండా పంటల వైవిధ్యత కి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించడం జరిగింది. ఇందులో భాగంగా ముఖ్యంగా కూరగాయలు, పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు మరియు ఆరుతడి పంటలు సాగును ప్రోత్సహించుకోవాలని తెలిపారు. రైతుల అవసరానికి మించి రసాయనిక ఎరువులు వాడకుండా సిఫారసు చేసిన మోతాదులోనే ఎరువులను వాడాలని సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భానుశ్రీ, అన్నారం సర్పంచ్ లత శ్రీనివాస్, ఉప సర్పంచ్ దయానంద్, ఏఈఓ శిల్ప, రైతులు నరేందర్ రెడ్డి, గంగారెడ్డి, తిరుపతి రెడ్డి, కిషన్, నర్సింలు, శ్రీకాంత్ రెడ్డి, పంగ రాజం, అంబిర్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కుల పరిరక్షణకు భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటం

కామారెడ్డి : చిరస్మరణీయం నవంబర్ 15న జనజాతీయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నవంబర్ 15న భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జనజాతీయ గౌరవ దినోత్సవ వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జనజాతీయ గౌరవ దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ధైర్యసాహసాలతో పోరాడిన భగవాన్ బిర్సా ముండా సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. 1875 నవంబర్ 15న జార్ఖండ్‌లోని ముండా గిరిజన కుటుంబంలో జన్మించిన బిర్సా ముండా గిరిజనుల భూమి హక్కులు, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 15న జనజాతీయ గౌరవ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనజాతీయ గౌరవ దినోత్సవంలో భాగంగా నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు రూపొందించిన కార్యక్రమాల ప్రణాళికను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా గిరిజనుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన నాయకుల పాత్రను ప్రజలకు తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా గిరిజన విద్యార్థులు, యువతలో ప్రతిభను వెలికితీసేలా క్విజ్, క్రీడా పోటీలు, సంప్రదాయ హస్తకళల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గిరిజన సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థల్లో కూడా వేడుకలను ఘనంగా నిర్వహించి, విద్యార్థులకు బిర్సా ముండా జీవిత చరిత్ర, పోరాట స్ఫూర్తి గురించి తెలియజేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. నవంబర్ 15న జరిగే ప్రధాన వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని పేర్కొన్నారు.





వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన గిరిజన యువతకు ఘన సన్మానం జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచి విశేష విజయాలు సాధించిన గిరిజన యువతను జిల్లా కలెక్టర్ అభినందించారు. గాంధారి మండలానికి చెందిన బాబ్లీ అనే విద్యార్థిని గిరిజన గురుకుల విద్యాసంస్థలో విద్యనభ్యసించి హిమాచల్ ప్రదేశ్‌లో 6 వేల మీటర్ల ఎత్తైన పర్వతాన్ని అధిరోహించడం గొప్ప విజయమని ప్రశంసించారు. అదేవిధంగా దక్షిణాసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించి ప్రస్తుతం భారత సైన్యంలో సేవలందిస్తున్న సుబేదార్ రవీందర్‌ను, పారా క్లైంబింగ్‌తో పాటు యోగాలో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో స్వర్ణ పతకాలు సాధించిన ఖుషిని అభినందించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం ఘనంగా సత్కరించింది. గిరిజనుల హక్కుల పరిరక్షణకు భారత రాజ్యాంగం ప్రత్యేక రక్షణలు, రిజర్వేషన్లు కల్పించిందని, రాజకీయ రంగంలోనూ గిరిజనులకు తగిన ప్రాధాన్యత కల్పించిందని కలెక్టర్ వివరించారు. జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ ప్రతిభ కనబరుస్తూ మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. గిరిజన విద్యార్థులు, యువత తమలోని ప్రతిభను గుర్తించి అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జిల్లా ఖ్యాతిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి. విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా రెవెన్యూ అధికారి పాండు, గిరిజన సంక్షేమ అధికారి సౌజన్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలు



కామారెడ్డి : జిల్లాలో వి.బి.జి. రామ్ జి పథకం పనుల పురోగతి, తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, నీటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను గుర్తించి తగిన పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లను పూర్తి చేసుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణ దశల వారీగా పురోగతిని సమీక్షిస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అలాగే వి.బి.జి. రామ్ జి పథకం కింద చేపడుతున్న పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతం చేయాలని, కూలీలకు ఉపాధి కల్పించేలా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయపాల్ రెడ్డి, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి మురళి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

- అన్ని ఏర్పాట్లు చేయాలి
కొనుగోలు కేంద్రాల్లో

కామారెడ్డి : అవసరమైన వసతులు కల్పించి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం సేకరించాలి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వానాకాలం (ఖరీఫ్) 2026-27 సీజన్‌కు సంబంధించి జిల్లాలో జరుగుతున్న వరిధాన్యం కొనుగోళ్ల పురోగతిపై గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు (ఎఫ్‌ఏక్యూ) అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే సేకరించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత వివరాలను ట్యాబ్‌లలో త్వరితగతిన నమోదు చేయాలని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ, రైతులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





అటవీ భూముల సరిహద్దుల్లో అక్రమ కంచెలు.. 9 మందికి అటవీశాఖ నోటీసులు

లింగంపేట్ : లింగంపేట్ మండలంలోని శెట్పల్లి, అయ్యపల్లి, అయ్య పల్లి తండా, గ్రామాలకు చెందిన తొమ్మిది మందికి అటవీశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. అటవీ ప్రాంతాల సరిహద్దుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కంచెలు ఏర్పాటు చేసినట్లు గుర్తించిన అధికారులు ఈ చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా అటవీశాఖ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ అశ్వక్ మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల్లో అక్రమంగా కంచెలు ఏర్పాటు చేయడం వల్ల వన్యప్రాణులు సంచారానికి ఆటంకం కలగడంతో పాటు వాటి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన కంచెలను వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో అటవీ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు శ్రీనివాస్, నవ్య, శారద, జీవన్, సుజాత పాల్గొన్నారు.



రీ సర్వే పనులను వేగవంతం చేయాలి

కామారెడ్డి : రోజువారీ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రీ సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతిరోజూ చేపడుతున్న సర్వే పనుల పురోగతిని సమీక్షించాలని, రోవర్ పరికరాల పనితీరు, వాటి వినియోగం, సర్వే బృందాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో 70 కాడాస్ట్రల్ రీ సర్వే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించిన అనంతరం వెంటనే సర్వే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామసభలు పూర్తయిన గ్రామాల్లో ఎలాంటి జాప్యం లేకుండా పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.

జిల్లాలో మొత్తం 158 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఉండగా, వారిలో 144 మంది తమ సమ్మతిని తెలియజేశారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం 50 సర్వే బృందాలను ఏర్పాటు చేసి, ప్రతి బృందానికి ఒక లైసెన్స్‌డ్ సర్వేయర్‌ను కేటాయించి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు గ్రామసభలు నిర్వహించిన రీ సర్వే గ్రామాల వివరాలు, రోజువారీ పురోగతి, సర్వే బృందాల పనితీరు తదితర అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



కేసీఆర్ స్థానంలో కేటీఆర్



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ రంగంలో అధికార కాంగ్రెస్, ప్రధాన విపక్ష బిఆర్ఎస్ ల మధ్య మాటల యుద్ధం రోజురోజుకు మరింత పదునెక్కుతోంది. ముఖ్యంగా ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మధ్య సాగుతున్న ప్రత్యక్ష వైరం ఇప్పుడు పరాకాష్టకు చేరింది. విధానాలు, పరిపాలనా లోపాల ఆధారంగా విమర్శలు చేసుకోవాల్సింది పోయి.. వ్యక్తిగత రూపం, గెటప్‌లు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, గడ్డం పెంచడం వంటి అంశాల దాకా విమర్శలు వెళ్లడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవలి సభల్లో సీఎం రేవంత్ రెడ్డి.. గడ్డం పెంచినంత మాత్రాన ఎవరూ రేవంత్ రెడ్డి కా లేరు అని సెటైర్లు వేయడం, గతంలో కేటీఆర్ లుక్‌పై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్–బీఆర్ఎస్ శ్రేణుల మధ్య పగను మరింత పెంచాయి. అయితే, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న నేత, ప్రతిపక్షంలో ఉన్న ఒక నాయకుడి వ్యక్తిగత ఇమేజ్‌పై ఇంతలా దృష్టి సారించి దాడి చేయడం వెనుక బలమైన రాజకీయ లెక్కలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వ్యూహంలో మొదటి ప్రధాన కోణం ? ప్రత్యర్థి గుర్తింపు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లో, మీడియా ముందుకు రావడం గణనీయంగా తగ్గించారు. అసెంబ్లీలో లేదా ప్రజాక్షేత్రంలో బిఆర్ఎస్ తరపున కేటీఆర్, హరీష్ రావులే ప్రధానంగా గళం విప్పుతున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ స్థానంలో బీఆర్ఎస్ ప్రధాన ముఖంగా కేటీఆర్‌ను రేవంత్ రెడ్డి స్వయంగా గుర్తించినట్లేనని పొలిటికల్ పండితులు అంచనా వేస్తున్నారు. కేటీఆర్‌నే తన ముఖాముఖి ప్రత్యర్థిగా ఎంచుకోవడం ద్వారా, ఇతర నాయకులను పక్కకు నెట్టి పోరును రేవంత్ వర్సెస్ కేటీఆర్ గా మలచడం కాంగ్రెస్ వ్యూహంలో భాగం. ప్రతిపక్ష నేతగా కేటీఆర్ లేవనెత్తే అడ్మినిస్ట్రేటివ్ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వ్యక్తిగత విమర్శలు ఒక అస్త్రంగా పనిచేస్తాయి. కేటీఆర్ ఇమేజ్, ఆయన బాడీ లాంగ్వేజ్‌ను టార్గెట్ చేయడం ద్వారా ఆయన ప్రతిష్టను దెబ్బతీయడం, డిఫెన్స్‌లోకి నెట్టడం మరియు మానసికంగా ఆయన విశ్వాసాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ పర్సనల్ ఎటాక్స్ సాగుతున్నాయనే అభిప్రాయం ఉంది. అదే సమయంలో, తెలంగాణ సంప్రదాయ రాజకీయాల్లో మాస్ శైలికి పెద్దపీట ఉంటుంది. కేటీఆర్ అర్బన్, కార్పొరేట్ లుక్‌కు భిన్నంగా తన పక్కా మాస్, తెలంగాణ రఫ్ అండ్ టఫ్ ఇమేజ్‌ను బలంగా చాటుకోవాలని రేవంత్ ప్రయత్నిస్తున్నారు. నేను కేడర్ నుంచి వచ్చిన మాస్ లీడర్‌ను, కేటీఆర్ అలా కాదు అనే సందేశాన్ని ప్రజల్లోకి పంపడానికే ఆయన ఈ తరహా పోలికలను తీసుకొస్తున్నారు. అయితే, ఈ విమర్శల నాణేనికి మరోవైపు కూడా ఉంది. ప్రతిపక్షం లేవనెత్తే మూసీ ప్రక్షాళన, గ్యారెంటీ అస్యూరెన్స్‌లు, విద్యుత్, నీటి సమస్యలు వంటి విధానపరమైన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, వ్యక్తిగత అంశాలపై పడటం కాంగ్రెస్ ప్రభుత్వ డిఫెన్సివ్ మైండ్ సెట్‌ను చూపుతోందని బీఆర్ఎస్ ఎదురుదాడి చేస్తోంది. పరిపాలనాంశాలపై కంటే ఇలాంటి వ్యక్తిగత పోరు ఎక్కువైతే, అది చివరికి ప్రజా సమస్యల చర్చను పక్కదారి పట్టిస్తుంది. రేవంత్ రెడ్డి వేస్తున్న ఈ వ్యక్తిగత బాణాలు కేటీఆర్‌ను సైకలాజికల్‌గా దెబ్బతీసేందుకు వేసిన స్కెచ్ కావచ్చు, లేదా కేసీఆర్ లేని లోటును కేటీఆర్‌కు అప్పగిస్తూ ఆయన్ను ప్రధాన ప్రత్యర్థిగా నిలబెట్టే వ్యూహం కావచ్చునని అంచనా వేస్తున్నారు.

ప్రత్యేక వ్యూహాలతో గ్రౌండ్ వర్క్

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి తారాస్థాయికి చేరుకుంటోంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ప్రత్యర్థులపై పైచేయి సాధించాలని పావులు కదుపుతున్నాయి. అయితే, అందరికంటే ముందుగానే అలర్ట్ అయ్యి, ప్రత్యేక వ్యూహాలతో గ్రౌండ్‌వర్క్ ప్రారంభించిన ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లో మాత్రం ఇప్పుడు సరికొత్త చర్చ నడుస్తోంది. పార్టీ అధినాయకత్వం ఎంత గట్టిగా ప్లాన్ చేసినా, క్షేత్రస్థాయిలో ఇన్చార్జుల నుంచి వస్తున్న స్పందన మాత్రం గులాబీ బాస్‌లకు షాకిస్తోంది. ఈ రెండు పట్టభద్రుల స్థానాల పరిధిలోని దాదాపు 40 నుంచి 50 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భావించారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం ఊపందుకునేలా ప్రతి నియోజకవర్గంలోనూ ఒక భారీ సన్నాహక సమావేశం ఏర్పాటు చేయాలని, తాను స్వయంగా వాటికి హాజరవుతానని కూడా ఆయన స్పష్టం చేశారు. కానీ, ఆచరణలోకి వచ్చేసరికి ఆ ప్లాన్‌కు అనూహ్యంగా బ్రేక్ పడింది. అభ్యర్థి ఎవరో ఖరారు కాకుండా నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాలు పెట్టడం కష్టమని, పైగా ఈ భారాంతా తమ భుజాల మీదే వేసుకోవడం ఇబ్బందికరమని ఇన్చార్జులు భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు అంటే మాటలు కాదని గులాబీ నేతలు లెక్కలు వేస్తున్నారు. భారీ హాల్స్ బుకింగ్స్, కార్యకర్తలకు భోజనాలు, ఇతర ఏర్పాట్ల కోసం తడిసిమోపెడవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. కేవలం రెండు మూడు నెలల క్రితమే ఎస్ఐఆర్ సన్నాహక సమావేశాల పేరుతో తాము భారీగా ఖర్చు పెట్టామని, అప్పట్లో కేటీఆర్, హరీష్ రావుల పర్యటనల కోసం జేబులు గుల్ల చేసుకున్నామని నేతలు వాపోతున్నారట. ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్సీ ఎన్నికలంటూ భారీ సభలు పెట్టి లక్షల రూపాయలు ఖర్చు పెట్టే ఆర్థిక పరిస్థితి లేదని, "డబ్బులేమన్నా ఊరికే వస్తున్నాయా?" అంటూ ఇన్చార్జులు అంతర్గతంగా పెదవి విరుస్తున్నట్లు సమాచారం. ఖర్చుల భయంతో పాటు రాబోయే రోజుల్లో జరిగే నియోజకవర్గాల పునర్విభజన అంశం కూడా నేతలను వెనకడుగు వేసేలా చేస్తోంది. భవిష్యత్తులో తమ పరిధిలో ఏయే మండలాలు ఉంటాయో, ఏవి మారుతాయో ఇప్పుడే స్పష్టత లేని పరిస్థితుల్లో.. కేవలం ఓటర్ల నమోదు కోసం ఇప్పుడు భారీగా ఖర్చు పెట్టడం దండుగ మారి పనేనని నేతలు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉందన్న ఆలోచనతో, ఇప్పటికప్పుడు భారీగా నిధులు ఖర్చు చేయడం అనవసరమని అధిష్టానానికి తేల్చిచెప్పినట్లు గులాబీ శిబిరంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక ఇన్చార్జుల నుంచి స్పందన మందగించడాన్ని గమనించిన అధిష్టానం కూడా పరిస్థితిని అర్థం చేసుకున్నట్లు తెలుస్తోంది. భారీ సభలు, ఆర్భాటాలకంటే కేవలం ఓటర్ల నమోదు ప్రక్రియే ముఖ్యమని భావించి పెద్ద ఎత్తున సమావేశాలు పెట్టాలనే ఆలోచనను పక్కనపెట్టింది. నియోజకవర్గాల వారీగా కాకుండా, మండల స్థాయిలోనే సింపుల్‌గా సమావేశాలు నిర్వహించు కోవాలని గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు, ముందుగా అభ్యర్థిని ప్రకటించి, ఆ తర్వాత మీటింగ్‌లు పెడితేనే క్యాడర్‌లో జోష్ వస్తుందని, లేదంటే అనవసర ప్రయాస అవుతుందనే వాదనకు పార్టీ పెద్దలు కూడా సుముఖత చూపినట్లు తెలుస్తోంది. మొత్తానికి, డబ్బుల్లేవ్ అంటూ ఇన్చార్జులు చూపిన నిరాసక్తత ఇప్పుడు బీఆర్ఎస్ వ్యూహాత్మక సర్దుబాట్లకు కారణమవుతోంది.

నామినేటెడ్ పితలాటకం



హైదరాబాద్ : తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టి డిసెంబర్ 7 నాటికి మూడేళ్లు పూర్తి చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కార్పొరేషన్లు, కమిషన్లు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవుల భర్తీ ఒక కత్తిమీద సాములా మారింది. అధికారం చేపట్టిన కొత్తలో పదవులు ఆశించి నిరాశ చెందిన ద్వితీయ శ్రేణి నాయకత్వం, పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన కేడర్ నుంచి ఒత్తిడి తీవ్రమవుతున్న వేళ.. నిర్ణయాలు మాత్రం నిరవ ధికంగా వాయిదా పడుతున్నాయి. ఒకవైపు పార్టీ సంస్థాగత బలోపేతం, మరోవైపు భవిష్యత్ ఎన్నికల ముఖచిత్రం.. ఈ రెండింటి సమతూకం కుదరకపోవడమే ఈ రాజకీయ ప్రతిష్టంభనకు ప్రధాన కారణం. రాష్ట్రంలోని మెజారిటీ కార్పొరేషన్లు, కమిషన్లు ప్రస్తుతం నడిపించే నాయకుడు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. 2024లో నియమితులైన పలువురు ఛైర్మన్లు, పాలకమండలి సభ్యుల పదవీకాలం జూలై, ఆగస్టు నెలల్లోనే ముగిసింది. మిగిలిన విభాగాల్లోనూ పూర్తిస్థాయి నియామకాలు చేపట్టలేదు. నెలాఖరుకల్లా కొలిక్కి వస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పలుమార్లు సంకేతాలిచ్చినప్పటికీ, గ్రౌండ్ లెవల్‌లో ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఇప్పటికే రేవంత్ రెడ్డి, మహేష్ గౌడ్ మధ్య జరిగిన చర్చల్లో దాదాపు 15 కార్పొరేషన్లు, కమిషన్ల ఛైర్మన్లు, సభ్యుల ఎంపికపై ప్రాథమిక అవగాహన కుదిరినప్పటికీ, మిగిలిన కీలక విభాగాల విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. దీనికితోడు లండన్ వర్సిటీలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షీ నటరాజన్ అందుబాటులో లేకపోవడం కూడా ప్రక్రియలో జాప్యానికి కారణంగా కనిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఈ నెల 12న లేదా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి రోజైన నవంబరు 19న తొలి విడత నామినేటెడ్ పదవుల జాబితా వెలువడవచ్చనే ప్రచారం బలంగా సాగుతోంది. అయితే నవంబరు 12, 13, 14 తేదీల్లో హెచ్ఐసీసీలో జరిగే ప్రతిష్టాత్మక 'భారత్ సమ్మిట్'కు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ హాజరయ్యే అవకాశాలు ఉన్నందున, వారి రాకను బట్టి తుది భేటీ ఉండనుంది. ఒకవేళ ఇక్కడ కూడా పీటముడి వీడకపోతే స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఈ వ్యవహారం వాయిదా పడే ప్రమాదముంది. ఈ దఫా రెన్యూవల్ కేవలం నిర్మలా జగ్గారెడ్డి, ప్రీతమ్, బెల్లయ్యనాయక్, శివసేనారెడ్డి సహా ఆరుగురికి మించి ఉండకపోవచ్చని సమాచారం. మెజారిటీ స్థానాలను కొత్త ముఖాలకే కేటాయించి అసంతృప్తిని చల్లార్చాలని అధిష్ఠానం భావిస్తోంది. మరోవైపు గవర్నర్ కోటా కింద భర్తీ చేయాల్సిన మూడు ఎమ్మెల్సీ స్థానాల ప్రక్రియను డిసెంబర్ రెండో లేదా మూడో వారం వరకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పక్కనబెట్టింది. ముందుగా కార్పొరేషన్లను తేల్చి, ఆ తర్వాతే మండలి లెక్కలు తేల్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ నిర్ణయించారు. 2027 మార్చిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీకరణాలు ఈ వాయిదా వెనుక దాగి ఉన్నాయి. ముఖ్యంగా మహబూబ్‌నగర్– రంగారెడ్డి– హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం సీఎం సొంత జిల్లాను కలుపుకుని ఉండటంతో అక్కడ పాగా వేయడం ప్రతిష్టాత్మకంగా మారింది.

దీనిని దృష్టిలో ఉంచుకుని గవర్నర్ కోటా ఎమ్మెల్సీల్లో ఇద్దరు బీసీలకు, ఒక బ్రాహ్మణ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలనే ఫార్ములా తెరపైకి వచ్చింది. బీసీల కోటాలో పద్మశాలీతో పాటు మున్నూరు కాపు లేదా ముదిరాజ్ వర్గానికి చోటు కల్పించాలని యోచిస్తుండగా, బీఆర్ఎస్, బీజేపీలు బ్రాహ్మణ సామాజిక వర్గానికి ఇచ్చిన ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ కూడా ఆ వర్గాన్ని ప్రసన్నం చేసుకునే ఎత్తుగడ వేస్తోంది. మిగిలిన రెండేళ్ల పదవీకాలాన్ని సద్వినియోగం చేసుకుని, రాబోయే సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడాలని చూస్తున్న ఆశావహుల లాబీయింగ్ తారస్థాయికి చేరింది. అసంతృప్తి పెచ్చరిల్లకుండా, అన్ని వర్గాలనూ ఏకతాటిపై నిలపడం నాయకత్వానికి పెను పరీక్షగా మారింది

కవిత పార్టీ సత్తా చాటుతుందా

వరంగల్ : తెలంగాణ రక్షణ సేన ఏర్పాటు తర్వాత తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్న కల్వకుంట్ల కవిత.. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్ కొల్లూరును అభ్యర్థులుగా ప్రకటించారు. బీసీ వర్గానికి చెందిన విద్యార్థి నాయకులకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. 75 నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని స్థాపించిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ తనయ.. కల్వకుంట్ల కవిత తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. రాష్ట్రంలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఆమె తన పార్టీ తరఫున అభ్యర్థులను ప్రకటించి, ప్రచారాన్ని ముమ్మరం చేశారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్ కొల్లూరులను కవిత ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బరిలోకి దించారు. ఏ మాత్రం రాజకీయ నేపథ్యం లేని, చదువుకున్న విద్యార్థి నాయకులకు (కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల విద్యార్థులు) టికెట్లు ఇచ్చామని కవిత చెబుతున్నారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ఈ ఎన్నికల్లో పట్టభద్రులు బుద్ధి చెప్పాలని కవిత పిలుపునిచ్చారు. ఈ పార్టీలు ప్రజలను వేధిస్తున్నాయని.. ప్రజలకు ప్రత్యామ్నాయం ఎవరైనా ఉంటే అది తామేనని ఆమె చెప్పడం గమనార్హం. రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది పట్టభద్రులు ఉన్నప్పటికీ ఓటు నమోదు తక్కువగా ఉందని, గ్రాడ్యుయేట్లు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కవిత కోరారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో టీఆర్ ఎస్ పార్టీ కార్యాలయం వద్ద బుధవారం ప్రచార వాహనాలను ప్రారంభించిన కవిత, సింగరేణి ప్రాంతంతో పాటు నల్గొండ, ఆదిలాబాద్, మెదక్ తదితర 75 నియోజకవర్గాల పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. రాజకీయ సవాళ్లు బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి సొంత పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కవిత ఎదుర్కొంటున్న మొదటి ఎన్నికలు ఇవే కావడం గమనార్హం. కొత్త పార్టీకి క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ నిర్మించుకోవడం, ప్రధాన పార్టీల ఆర్థిక బలాన్ని తట్టుకోవడం ఆమె ముందున్న ప్రధాన సవాళ్లుగా పరిశీలకులు చెబుతున్నారు. అంతేకాదు.. విద్యావంతులు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటారు. సో.. ఈ క్రమంలో కవితకు విద్యావంతుల్లో ఏమేరకు ప్రభావం ఉంది? వారు ఏమేరకు ఆమెను స్వాగతిస్తున్నారన్న విషయం కూడా స్పష్టం అవుతుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు

డిసెంబర్ నుంచి డేంజర్ బెల్స్...

హైదరాబాద్ : అప్పట్లో 2002 సంవత్సరం.. ఇప్పటికీ ఆ కరువు కరాళనృత్యం అందరి మదిలో ఉంది. తెలుగునాట తీవ్రమైన కరువొచ్చింది.. నీళ్ల కోసం బిందెలు సైకిళ్లకు కట్టుకొని పొలాల వద్దకు వెళ్లి మిగిలిన కాసిన్ని నీటిని తెచ్చుకొని జనాలు తమ అవసరాలు తీర్చుకున్న పరిస్థితి. అప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా బిందెలు మోస్తూ వెళుతున్న దృశ్యాలే.... రైతులు అయితే పిట్టల్లా రాలారు. కరెంట్ లేక, తాగునీటి సౌకర్యం లేక జనాలు హరిగోస పడ్డారు. అంతటి తీవ్రమైన కరువు ఇప్పుడు ఎల్ నినోతో మరోసారి రాబోతోంది. ఈసారి హైదరాబాద్ మహానగారానికి అది పొంచి ఉంది. డిసెంబర్ నుంచే ఆ డేంజర్ బెల్స్ మోగనున్నాయి. హైదరాబాద్ ప్రజల గొంతులో ఇప్పుడు పచ్చి వెలక్కాయ పడింది. వేసవి దాహార్తి గురించి మనం ప్రతీ ఏడాదీ వింటూనే ఉంటాం.. కానీ ఈసారి వేసవి రావాల్సిన అవసరం కూడా లేదేమో అనిపిస్తోంది. చలికాలం ముగిసేలోపే అంటే సరిగ్గా డిసెంబర్ నెల నుంచే హైదరాబాద్‌కు 'కన్నీటి' కష్టాలు మొదలు కానున్నాయనే వార్త తెలంగాణ ప్రజలను.. ముఖ్యంగా నగరవాసులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఒకప్పుడు నిండుగా ప్రవహించే చెరువులు.. కుంటలతో కళకళలాడిన హైదరాబాద్ తాగునీటి వనరులు ఇప్పుడు బొట్టు నీటికి కూడా అల్లాడే పరిస్థితి దాపురిస్తోంది. హైదరాబాద్‌కు ప్రధానంగా తాగునీటిని అందించే సింగూరు.. మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు మునుపెన్నడూ లేనంతగా క్షీణించి పోతున్నాయి. డిసెంబర్ నాటికి ఈ రిజర్వాయర్లలో నీటి మట్టం కేవలం 10 శాతానికి పడిపోయే ప్రమాదం ఉందన్న జలమండలి అంచనాలు గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. ఈ నీటి సంక్షోభం ప్రభావం ప్రధానంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ సిటీలో భాగమైన హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, నార్సింగి, కోకాపేట వంటి ఐటీ హబ్‌లపై దారుణంగా పడనుంది. శేరిలింగంపల్లిలో ఏకంగా 80 శాతం.. జూబ్లీహిల్స్‌లో 50 శాతం వరకు నీటి సరఫరా నిలిచిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. రోజుకు సుమారు 10 కోట్ల గ్యాలన్ల నీటి లోటు ఏర్పడితే.. ఉదయాన్నే లేచి కుళాయి తిప్పితే చుక్క నీరు రాకపోతే.. పిల్లలను స్కూళ్లకు.. ఉద్యోగాలకు పంపే కుటుంబాల పరిస్థితి ఎంత నరకప్రాయంగా మారుతుందో ఊహించుకోవడానికే భయమేస్తోంది. రూ.కోట్లు వెచ్చించి కొనుక్కున్న ప్లాట్లు.. 40 అంతస్తుల విలాసవంతమైన ఫ్లాట్లు ఉన్నా.. గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీళ్లు లేకపోతే ఆ అభివృద్ధికి అర్థమేముంది? వందల అడుగులు తవ్వినా భూగర్భ జలాలు ఊరని పరిస్థితి నెలకొంటుంది.. రోజువారీ అవసరాల కోసం ట్యాంకర్ల వెంట బకెట్లతో పరుగులు తీయాల్సిన దుస్థితి వస్తే సామాన్య.. మధ్యతరగతి కుటుంబాల బతుకులు మరింత భారమవుతాయి. కనీస అవసరమైన మంచి నీరు కూడా ఖరీదైన వ్యాపారంగా మారిపోకముందే.. ప్రభుత్వం, జలమండలి అధికారులు తక్షణమే స్పందించాలి. ప్రత్యామ్నాయ గోదావరి జలాల తరలింపు వేగవంతం చేసి.. లీకేజీలను అరికట్టి నగర దాహార్తిని తీర్చకపోతే.. నగరంలో వికాసం కాదు.. వినాశనమే మిగులుతుంది. ఎందుకంటే ఎన్ని ఫ్లైఓవర్లు కట్టినా.. ఎన్ని ఆకాశహర్మ్యాలు నిర్మించినా చివరకు మనిషికి కావాల్సింది గుక్కెడు మంచినీళ్లే..

కరువు మండలాల్లో రుణాల వసూళ్లకు బ్రేక్

హైదరాబాద్ : తెలంగాణలో కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు భారీ ఊరట లభించనుంది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మండలాల్లో రైతులు తీసుకున్న పాత రుణాల వసూళ్లను 12 నెలల పాటు నిలిపివేయాలని నిర్ణయించింది. అంతేకాదు.. రుణాలు తిరిగి చెల్లించేందుకు రైతులకు 3 నుంచి 5 ఏళ్ల వరకు గడువు కల్పించనుంది. దీంతో అప్పుల చెల్లింపుల విషయంలో రైతులకు కొంత ఉపశమనం లభించనుంది. రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదనకు బ్యాంకర్లు కూడా సూత్రప్రాయంగా అంగీకరించారు. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బ్యాంకర్లతో మాట్లాడారు. కరువు కారణంగా పంటలు దెబ్బతిని ఇబ్బందులు పడుతున్న రైతుల నుంచి ప్రస్తుతం ఉన్న రుణాలను వెంటనే వసూలు చేయకుండా మారటోరియం అమలు చేయాలని కోరారు. అలాగే రానున్న రబీ సీజన్‌లో సాగు పనుల కోసం రైతులకు కొత్త రుణాలు కూడా ఇవ్వాలని సూచించారు. బ్యాంకర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం.. ఓ మోస్తరు కరువు ఉన్న 254 మండలాల్లో రైతుల రుణాల వసూళ్లను 12 నెలల పాటు నిలిపివేస్తారు. ఈ రుణాలను తిరిగి చెల్లించేందుకు రైతులకు 36 నెలల గడువు కల్పిస్తారు. అంటే మూడేళ్లలోపు రుణాలను చెల్లించాల్సి ఉంటుంది. అదే తీవ్ర కరువు పరిస్థితులు ఉన్న 111 మండలాల్లోనూ 12 నెలల పాటు రుణాల వసూళ్లు నిలిపివేస్తారు. అయితే ఈ మండలాల రైతులకు రుణాల చెల్లింపునకు 60 నెలల గడువు ఇవ్వనున్నారు. అంటే ఐదేళ్లలోపు రుణాలు తిరిగి చెల్లించే అవకాశం ఉంటుంది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. మారటోరియం కోసం రైతులు ప్రత్యేకంగా ముందుకొచ్చినా, రాకపోయినా బ్యాంకులే అర్హులైన రైతులను గుర్తించి ఉపశమన చర్యలు చేపట్టనున్నాయి. రైతుల బ్యాంకు ఖాతాలను పరిశీలించి అర్హులకు మారటోరియం అమలు చేయడంతో పాటు రబీ సీజన్‌కు కొత్త రుణాలు కూడా మంజూరు చేయనున్నారు. ఫామ్‌లు అన్వేషించండిమారటోరియం అమలయ్యే 12 నెలల కాలానికి రైతుల రుణాలపై పడే వడ్డీ భారాన్ని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఆ వడ్డీని రాయితీ రూపంలో సర్దుబాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనుంది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల వివరాలను 15 రోజుల్లోగా రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సీఐఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర బ్యాంకర్ల సమావేశం నిర్ణయించింది.

ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ సిద్ధం



హైదరాబాద్ : హైదరాబాద్ శివార్లలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'ఫ్యూచర్ సిటీ' మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. సింగపూర్‌కు చెందిన ప్రఖ్యాత సంస్థ 'డీపీ ఆర్కిటెక్ట్స్' అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ ప్రణాళికను రూపొందించింది. మొత్తం 1.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న ఈ నగరం మాస్టర్ ప్లాన్‌ను త్వరలో జరిగే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పురపాలక శాఖ అధికారుల సమాచారం ప్రకారం, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) పరిధిలోని 7 మండలాలు, 71 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రణాళికను రూపొందించారు. నగరాల అస్తవ్యస్త విస్తరణకు అడ్డుకట్ట వేస్తూ, పర్యావరణ సమతుల్యతను కాపాడటం దీని ముఖ్య ఉద్దేశం. భూ వినియోగ ప్రణాళిక కింద వ్యవసాయ, నివాస, పారిశ్రామిక, వాణిజ్య, పర్యావరణ పరిరక్షణ ప్రాంతాలను స్పష్టంగా విభజించారు. పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తూనే ఉద్యోగుల నివాసాలు, విద్య, వైద్యం వంటి సామాజిక వసతులపై దృష్టి సారించారు. 2047 నాటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ ప్లాన్‌లో రవాణా సౌకర్యాలకు పెద్దపీట వేశారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారులను అనుసంధానించనున్నారు. పర్యావరణ అనుమతులపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో పిటిషన్ దాఖలు కావడంతో, చెరువులు, నాలాలు, అటవీ ప్రాంతాల పరిరక్షణకు ఈ ప్రణాళికలో స్పష్టమైన మార్గదర్శకాలు చేర్చారు. ఈ మాస్టర్ ప్లాన్‌లో వివిధ రంగాలకు ప్రత్యేక జోన్లను కేటాయించారు. ఇందులో లైఫ్ సైన్సెస్ హబ్‌కు 4,000 ఎకరాలు, నివాస ప్రాంతాలకు 2,477 ఎకరాలు, ఎలక్ట్రిక్ వాహనాలు–ఎనర్జీ పార్కులకు 1,976 ఎకరాలు కేటాయించారు. అలాగే హెల్త్ సిటీకి 594 ఎకరాలు, ఏఐ సిటీకి 403 ఎకరాలు, డేటా సెంటర్ హబ్‌కు 313 ఎకరాలు, ఎడ్యుకేషన్ హబ్‌కు 255 ఎకరాలు కేటాయించారు. మరోవైపు, మాస్టర్ ప్లాన్ సిద్ధమైన నేపథ్యంలో తమ భూములు ఏ జోన్ పరిధిలోకి వస్తాయోనన్న ఆందోళన రైతులు, భూ యజమానులు, రియల్ ఎస్టేట్ వర్గాల్లో నెలకొంది. రైతుల హక్కులు, భూసేకరణ, పరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్‌కు దక్షిణంగా రంగారెడ్డి జిల్లాలో ఓఆర్ఆర్, శ్రీశైలం, నాగార్జునసాగర్ హైవేల మధ్య విస్తరించి ఉన్న ఈ నగరాన్ని 'నెట్–జీరో స్మార్ట్ సిటీ'గా అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం.

బిజినెస్

ఒకేరోజు రూ.1400 తగ్గిన బంగారం ధర.. 1.86 లక్షలకు దిగొచ్చిన వెండి..!



దేశీయ మార్కెట్లో బంగారం వెండి ధరలు దిగి వస్తున్నాయి. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు, వడ్డీరేట్ల పెంపు అంచనాల కారణంగా అంతర్జాతీయ విపణిలో బంగారం, వెండి లోహాల నుంచి పెట్టుబడులు వెనక్కి మళ్లుతున్నాయి. ఆ ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో వెండి, బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇవాళ (గురువారం) ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాద్ విపణిలో 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,350కు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే బంగారం ధర ఏకంగా రూ.1400 తగ్గింది. ఇక కిలో వెండి ధర రూ.1,86,550 పలికింది. బుధవారంతో పోలిస్తే వెండి ధర దాదాపు రూ.3 వేలకుపైనే తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 3,974 డాలర్‌లు, ఔన్సు వెండి ధర 51.48 డాలర్లు పలుకుతున్నాయి. బంగారం ధర ఈ స్థాయిలో దిగిరావడం నవంబర్ 4 తర్వాత మళ్లీ ఇదే తొలిసారి. ఇక మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో డిసెంబర్ డెలివరీకి బంగారం 10 గ్రాముల ధర రూ.1.38 లక్షలకు తగ్గింది. కేజీ వెండి ధర రూ.1.82 లక్షలకు దిగి వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ వాల్యూ 19 నెలల గరిష్ఠానికి చేరింది. అంతర్జాతీయంగా బంగారం-వెండి లావాదేవీలు డాలర్లలోనే జరుగుతాయి. డాలర్ విలువ పెరిగినప్పుడు ఇతర దేశాల కరెన్సీల్లో బంగారం, వెండి కొనుగోలు ఖరీదైనదిగా మారుతుంది. దాంతో అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గి, స్పాట్ మార్కెట్‌తోపాటు ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ లోహాల ధరలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇక వచ్చే నెలలో ఫెడ్ వడ్డీ రేట్లను పెంచవచ్చన్న అంచనాలు కూడా బంగారం, వెండి ధరలపై ఒత్తిడిని పెంచుతున్నాయి.

జెన్సన్‌ను తొలగిస్తే.. నేను చేర్చుకుంటా: ఎలాన్ మస్క్



ఇంటర్నెట్ డెస్క్: ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ గూఢచర్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎన్విడియా బోర్డు ఆయన్ను సీఈఓ పదవి నుంచి తప్పించేందుకు యోచిస్తున్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. ఈ నేపథ్యంలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు చేశారు. జెన్సన్‌ను తొలగిస్తే.. తన కంపెనీలో నియమించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు అభిప్రాయపడ్డారు. జీరోహెడ్జ్ అనే ఫైనాన్షియల్ బ్లాగ్ సామాజిక మాధ్యమాల్లో ఓ ఆసక్తికర పోస్ట్ చేసింది. 'ఎలాన్ మస్క్.. జెన్సన్‌ను మీ కంపెనీలో నియమించుకోండి' అని కోరగా.. దీనికి మస్క్ సానుకూలంగా స్పందించారు. 'జెన్సన్‌ను తొలగిస్తే.. నేను నియమించుకుంటా. అది గొప్ప అవకాశంగా భావిస్తాను' అని బదులిచ్చారు. ప్రస్తుతం ఆయన చేసిన కామెంట్ నెట్టింట వైరల్‌గా మారింది. చైనా గూఢచారి అలిస్ హువాంగ్‌తో సంబంధం ఉన్నట్లు జెన్సన్ ఇప్పటికే అంగీకరించారు. తాజాగా ఎన్విడియా (చీజఅఎఱఱ) హెల్త్‌కేర్ విభాగం వైస్‌ప్రెసిడెంట్ కింబర్లీ పావెల్‌తో కూడా ఆయనకు సన్నిహిత సంబంధం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఆయన్ను సీఈఓ పదవి నుంచి తప్పించేందుకు ఎన్విడియా బోర్డు యోచిస్తున్నట్లు కథనాలు వస్తుండగా.. మస్క్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

నెలకు రూ.20 వేల జీతం నుంచి రూ.1.4 కోట్ల ఆదాయం!



ఉన్నత విద్య, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశం, భారీ వేతనాలతో కూడిన కార్పొరేట్ ఉద్యోగాలు.. ఇవే విజయానికి ఏకైక మార్గాలనే సంప్రదాయ ఆలోచనలకు భిన్నంగా ఓ 22 ఏళ్ల యువకుడి ప్రయాణం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నెలకు కేవలం రూ.20 వేల సగటు ఆదాయంతో కెరీర్‌ను ప్రారంభించి గత ఏడాది కాలంలో రూ.1.4 కోట్లకు పైగా సంపాదించినట్లు అతడు వెల్లడించాడు. ఈ వివరాలు సామాజిక మాధ్యమ వేదిక రెడ్డిట్‌లోని కమ్యూనిటీలో పంచుకున్న పోస్టు ద్వారా వెలుగులోకి వచ్చాయి.

ఇంటర్మీడియట్ తర్వాతే ఉద్యోగం..

సదరు యువకుడు 12వ తరగతి (ఇంటర్) పూర్తయిన వెంటనే ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించినట్లు తన పోస్టులో పేర్కొన్నాడు. అదే సమయంలో ఒక టైర్-3 కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ) చదువును కొనసాగించాడు. ఓవైపు ఉద్యోగం చేస్తూనే, మరోవైపు డైరెక్ట్ రెస్పాన్స్ కాపీరైటింగ్‌పై పట్టు సాధించేందుకు పుస్తకాలు, ఆన్‌లైన్ కోర్సులను ఆశ్రయించాడు. ప్రారంభంలో పెద్దగా ఆదాయం లేకపోయినా క్రమంగా తన నైపుణ్యాలను పెంచుకున్నట్లు తెలిపాడు. కేవలం ప్రకటనలు రాయడానికే పరిమితం కాకుండా ప్రొడక్ట్ రీసెర్చ్, మార్కెటింగ్ ఫన్నెల్స్, ఫన్నెల్ ఎకనామిక్స్, రిక్రూట్‌మెంట్ వంటి కీలక విభాగాల్లో అనుభవం సంపాదించాడు. ముఖ్యంగా అమెరికా, యూరప్ దేశాల్లోని క్లయింట్లతో వృత్తిపరమైన సంబంధాలు ఏర్పరచుకోవడానికి లింక్డ్‌ఇన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకున్నట్లు వివరించాడు.

అమెరికా కంపెనీతో అంతర్జాతీయ అవకాశం

ప్రస్తుతం అమెరికాకు చెందిన ఓ సప్లిమెంట్ బ్రాండ్‌లో పనిచేస్తున్నట్లు ఆ యువకుడు వెల్లడించాడు. ఆ సంస్థ మార్కెటింగ్ వ్యూహాలు, ప్రకటనల రూపకల్పన, కస్టమర్లను ఆకర్షించే విధానాల అభివృద్ధిలో తన పాత్ర కీలకమని పేర్కొన్నాడు. తన సహకారంతో ఆ బ్రాండ్ నెలవారీ ఆదాయం 35 లక్షల డాలర్ల స్థాయికి చేరినట్లు చెప్పుకొచ్చాడు. పనితీరు ఆధారంగా తన వేతనంలో 250 శాతం పెరుగుదలతోపాటు బోనస్ విధానంలో మార్పులు చోటుచేసుకున్నట్లు వెల్లడించాడు. ప్రస్తుతం తాను ఏడాదికి రూ.1.4 కోట్లు సంపాదిస్తున్నట్లు చెప్పాడు.

ఈ ఉదంతాన్ని కేవలం ఒక వ్యక్తి ఆదాయ విజయగాథగా మాత్రమే చూడకూడదు. మారుతున్న అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్‌లో నైపుణ్యాల ప్రాధాన్యాన్ని గమనించాలి. కంపెనీ ఆదాయ వృద్ధికి నేరుగా దోహదపడే నైపుణ్యాలను ఎంచుకోవాలి. ముఖ్యంగా ఏఐ ఆధారిత ఆటోమేషన్ వంటి ఆధునిక రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆ యువకుడు సూచిస్తున్నాడు. అయితే ఒక్కసారిగా సంపన్నులు కావాలనే తొందరపాటు ఆలోచన కంటే సహనం, నిరంతర అభ్యాసం, ఆచరణాత్మక అనుభవం ఎంతో ముఖ్యమని చెప్పాడు.

స్వల్ప లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ.. 4 శాతం పెరిగిన రియల్టీ సూచీ

రియల్టీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు

31.61 పాయింట్లు పెరిగి 81,911 వద్ద ముగిసిన సెన్సెక్స్

44.30 పాయింట్లు లాభపడి 25,299 వద్ద స్థిరపడ్డ నిఫ్టీ

ఏకంగా 4 శాతం లాభపడ్డ రియల్టీ సూచీ

నష్టపోయిన ఆటో రంగ షేర్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. రియల్టీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో కొనుగోళ్లు సూచీలకు అండగా నిలిచాయి. ఆటో షేర్లలో అమ్మకాల ఒత్తిడి లాభాలను పరిమితం చేసింది. సెన్సెక్స్ 31.61 పాయింట్లు పెరిగి 81,911.01 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 44.30 పాయింట్లు లాభపడి 25,299.35 వద్ద ముగిసింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు ప్రధాన సూచీల కంటే మెరుగైన పనితీరు కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్-100 సూచీ 0.85 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్-100 సూచీ 1.12 శాతం చొప్పున పెరిగాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ రియల్టీ సూచీ ఏకంగా 4 శాతం ఎగబాకి అగ్రస్థానంలో నిలిచింది. పీఎస్‌యూ బ్యాంక్, మీడియా, బ్యాంక్ సూచీలు కూడా లాభపడ్డాయి. మరోవైపు నిఫ్టీ ఆటో సూచీ అత్యధికంగా నష్టపోయింది. నిఫ్టీ షేర్లలో మహీంద్రా అండ్ మహీంద్రా, నెస్లే ఇండియా, పవర్‌గ్రిడ్ నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ గత రెండు మూడు ట్రేడింగ్ సెషన్లుగా పరిమిత శ్రేణిలో కదులుతున్నప్పటికీ, మొత్తం మీద సానుకూల ధోరణి కొనసాగుతోందని మార్కెట్ నిపుణులు తెలిపారు. సూచీ ఓవర్‌బాట్ స్థాయిలో ఉండటంతో స్వల్ప దిద్దుబాటుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. 25,000 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు, 24,800 వద్ద కీలక మద్దతు ఉన్నాయని అంచనా వేశారు. పైవైపు 25,500 పాయింట్ల వద్ద నిరోధం ఎదురుకావచ్చని, ప్రస్తుతానికి 25,000-25,500 శ్రేణిలో కదలొచ్చని తెలిపారు.

నాలుగో వన్డేకు కొత్త టీమిండియా.. కెప్టెన్‌గా అయ్యర్.. టీమ్‌లో కీలక మార్పులు!

స్పోర్ట్స్

గిల్ స్థానంలో శ్రేయస్ అయ్యర్ తొలిసారి వన్డేల్లో కెప్టెన్సీ

రాహుల్, కాంబోజ్ కూడా దూరం కావడంతో ఇషాన్ కిషన్, తిలక్ వర్మకు అవకాశాలు

బౌలింగ్‌లో సిరాజ్, కుల్దీప్‌కు చోటు దక్కే ఛాన్స్

సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో ఉన్న భారత్

న్యూజిలాండ్ జట్టులోనూ పలు కీలక మార్పులు



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ కైవసమే లక్ష్యంగా టీమిండియా నాలుగో మ్యాచ్‌కు సిద్ధమైంది. శుక్రవారం మౌంట్ మాంగనూయిలోని బే ఓవల్ వేదికగా జరగనున్న ఈ పోరులో భారత్‌కు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహించనున్నాడు. రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టెస్టు సిరీస్ సన్నాహాల కోసం వెళ్లడంతో అతడికి ఈ బాధ్యతలు దక్కాయి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ప్రస్తుతం 2-0 ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంటుంది. మూడో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. గిల్ నాయకత్వంలో వన్డే టీమ్‌ను తొలి మూడు మ్యాచ్ లకు మాత్రమే ఎంపిక చేశారు. ఇప్పుడు మిగతా రెండు మ్యాచ్ లలో భారత్ కు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహిస్తాడు. గిల్‌తో పాటు కేఎల్ రాహుల్, అన్షుల్ కాంబోజ్ కూడా నాలుగో వన్డేకు అందుబాటులో ఉండరు. వీరి స్థానాల్లో తిలక్ వర్మ, కుమార్ కుశాగ్ర, యశ్ ఠాకూర్ జట్టులో చేరారు. తొలి మూడు మ్యాచ్‌ల్లో బెంచ్‌కే పరిమితమైన ఇషాన్ కిషన్ ఈసారి తుది జట్టులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. రోహిత్ శర్మతో కలిసి అతడు ఓపెనింగ్ చేసే అవకాశముంది. రాహుల్ స్థానంలో వికెట్ కీపింగ్ బాధ్యతలు కూడా ఇషానే చేపట్టే ఛాన్స్ ఉంది. ఐదో స్థానంలో బ్యాటింగ్ చేసేందుకు తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ మధ్య పోటీ నెలకొంది. తిలక్ ఈ పర్యటనలో ఇప్పటికే టీ20 మ్యాచ్‌లు ఆడటంతో పాటు ఇండియా-ఏ తరఫున న్యూజిలాండ్-ఏతో జరిగిన అనధికారిక టెస్టులో హాఫ్ సెంచరీ చేశాడు. గైక్వాడ్‌కు కూడా గతంలో వన్డేల్లో మిడిలార్డర్‌లో ఆడిన అనుభవం ఉంది.

మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్ తొలి మూడు వన్డేల్లో తుది జట్టులో చోటు దక్కించుకోలేదు. కాంబోజ్ దూరం కావడంతో వీరిలో ఒకరికి అవకాశం లభించనుంది. అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, ఆకిబ్ నబీలలో ఒకరికి విశ్రాంతి ఇస్తే సిరాజ్, కుల్దీప్ ఇద్దరికీ చోటు దక్కవచ్చు. మరోవైపు న్యూజిలాండ్ జట్టులోనూ పలువురు కీలక ఆటగాళ్లు టెస్టు సన్నాహాల కోసం వన్డే సిరీస్ నుంచి తప్పుకొన్నారు. దీంతో ఆ జట్టు కొత్త కూర్పుతో బరిలోకి దిగనుంది. మ్యాచ్ వివరాలు: నవంబర్ 13, శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ప్రారంభం. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం, సోనీ లివ్‌లో లైవ్ స్ట్రీమింగ్ ఉంటుంది.

సత్తా చాటుతున్న ఆసీస్ యువ సంచలనం.. సీజన్‌లో మూడో సెంచరీతో టెస్టు రేసులోకి శామ్ కాన్‌స్టాస్

షెఫీల్డ్ షీల్డ్‌లో అజేయ శతకంతో చెలరేగిన శామ్ కాన్‌స్టాస్

సౌత్ ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో న్యూసౌత్‌వేల్స్‌ను ఆదుకున్న యువ బ్యాటర్

ఈ వేసవిలో నాలుగు దేశవాళీ మ్యాచ్‌ల్లో ఇది మూడో సెంచరీ

ఆస్ట్రేలియా టెస్ట్ జట్టులో చోటు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్న కాన్‌స్టాస్

కుర్టిస్ ప్యాటర్సన్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన వైనం



ఆస్ట్రేలియా టెస్ట్ జట్టులో తిరిగి చోటు దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్న యువ బ్యాటర్ శామ్ కాన్‌స్టాస్, అద్భుత శతకంతో ఆకట్టుకున్నాడు. షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో భాగంగా సౌత్ ఆస్ట్రేలియాతో జరుగుతున్న మ్యాచ్‌లో ఈ వేసవిలో తన మూడో సెంచరీని నమోదు చేసి, న్యూసౌత్‌వేల్స్ (ఎన్ఎస్‌డబ్ల్యూ) జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపాడు. సిడ్నీ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి కాన్‌స్టాస్ 109 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతని హీరోయిక్ ఇన్నింగ్స్ ఫలితంగా ఎన్ఎస్‌డబ్ల్యూ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లకు 191 పరుగులు చేసి, 70 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 204 పరుగులకే ఆలౌట్ అయి కష్టాల్లో పడిన జట్టును కాన్‌స్టాస్ ఆదుకున్నాడు. మరో బ్యాటర్ కుర్టిస్ ప్యాటర్సన్‌తో కలిసి రెండో వికెట్‌కు 117 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. గత ఏడాది జూలైలో ఐదు టెస్టులు ఆడిన తర్వాత జాతీయ జట్టులో స్థానం కోల్పోయిన ఈ 21 ఏళ్ల యువకుడు, అప్పటి నుంచి దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్నాడు. ఈ క్రమంలోనే డిసెంబర్‌లో న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న టెస్ట్ సిరీస్‌కు తనను ఎంపిక చేయాలంటూ సెలక్టర్లకు గట్టి సంకేతాలు పంపుతున్నాడు. ఈ సీజన్‌లో అతను ఆడిన గత నాలుగు దేశవాళీ మ్యాచ్‌లలో ఇది మూడో సెంచరీ కావడం విశేషం. ఈ అజేయ శతకంతో పాటు షెఫీల్డ్ షీల్డ్‌లో 71, 151 (నాటౌట్), 5, 2, 24 పరుగులు, ఇటీవల 50 ఓవర్ల మ్యాచ్‌లో 149 పరుగులు చేసిన అతని గణాంకాలు, సెలక్టర్ల మదిలో అతని పేరును స్థిరంగా ఉంచుతున్నాయి. ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ మధ్య తొలి టెస్ట్ డిసెంబర్ 9న పెర్త్‌లో ప్రారంభం కానుంది.

21 సిక్సర్లతో విరుచుకుపడ్డ కివీస్ బ్యాటర్.. లిస్ట్-ఏ క్రికెట్‌లో రికార్డు ఇన్నింగ్స్



న్యూజిలాండ్ యువ బ్యాటర్ బెవాన్ జాకబ్స్ దేశవాళీ క్రికెట్‌లో విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చరిత్ర సృష్టించాడు. ఫోర్డ్ ట్రోఫీలో భాగంగా గురువారం ఆక్లాండ్ తరఫున ఒటాగోతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 137 బంతుల్లోనే అజేయంగా 202 పరుగులు సాధించాడు. ఇందులో ఏకంగా 21 సిక్సర్లు బాదాడు. దీంతో లిస్ట్-ఏ క్రికెట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన న్యూజిలాండ్ బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ప్రపంచ రికార్డుకు మాత్రం మరో రెండు సిక్సర్ల దూరంలో నిలిచాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన 28 ఏళ్ల జాకబ్స్.. తన తొలి లిస్ట్-ఏ సెంచరీని డబుల్ సెంచరీగా మలిచాడు. 137 బంతుల్లోనే 200 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, 21 సిక్సర్లు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో న్యూజిలాండ్ తరఫున లిస్ట్-ఏ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా నిలిచాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ప్రపంచ రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన డార్సీ షార్ట్ పేరిట ఉంది. 2018లో సిడ్నీలో వెస్ట్రన్ ఆస్ట్రేలియా తరఫున క్వీన్స్‌లాండ్‌పై ఆడుతూ 148 బంతుల్లో 257 పరుగులు చేసిన షార్ట్.. 23 సిక్సర్లు బాదాడు. జాకబ్స్ 21 సిక్సర్లతో ఆ రికార్డుకు చేరువయ్యాడు. జాకబ్స్ అజేయంగా చేసిన 202 పరుగులు ఫోర్డ్ ట్రోఫీలో ఆక్లాండ్ ఏసెస్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరుగా నమోదయ్యాయి. ఈ టోర్నీలో డబుల్ సెంచరీ సాధించిన మూడో బ్యాటర్‌గా కూడా నిలిచాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో డబుల్ సెంచరీ చేసిన నాలుగో న్యూజిలాండ్ బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. ఇంతకుముందు జేమీ హా (2012), మార్టిన్ గప్టిల్ (2015), చాడ్ బౌస్ (2024) ఈ ఘనత సాధించారు. జాకబ్స్ అద్భుత ఇన్నింగ్స్‌తో ఆక్లాండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 334 పరుగులు చేసింది. అయితే ఒటాగో 49.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో జాకబ్స్ పోరాటం జట్టుకు విజయాన్ని అందించలేకపోయింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల బ్యాటర్లు కలిపి మొత్తం 34 సిక్సర్లు బాదారు. ఇటీవల భారత్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోనూ జాకబ్స్ రాణించాడు. ప్రపంచ ఛాంపియన్ భారత జట్టుపై 135కిపైగా పరుగులు సాధించాడు. న్యూజిలాండ్ తరఫున 2024 చివర్లో అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసిన అతడు ఇప్పటివరకు 16 మ్యాచ్‌లు ఆడాడు. అయితే వన్డేలు, టెస్టుల్లో ఇంకా అరంగేట్రం చేయలేదు.

‘ఇడుపు కాయితం’ టీజర్ వచ్చేసింది.. డిసెంబర్ 11న గ్రాండ్‌గా రిలీజ్!



టాలీవుడ్ వర్గాల్లో ప్రస్తుతం ఆసక్తికరంగా చర్చనీయాంశంగా మారిన చిత్రం ‘ఇడుపు కాయితం’. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే టాలెంటెడ్ హీరో ప్రియదర్శి పులికొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా విడుదలైన టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. తెలంగాణ మట్టి వాసన ఉట్టిపడేలా, పల్లెటూరి సంప్రదాయాలు మరియు కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ప్రియదర్శి సరసన నాగదుర్గ కథానాయికగా నటిస్తూ ఈ చిత్రంతో వెండితెరకు పరిచయమవుతున్నారు. వంశీరెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు సుకుమార్ రైటింగ్స్ మరియు బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్, బన్నీ వాస్, తబితా సుకుమార్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి అందిస్తున్న సంగీతం అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పటికే విడుదలైన ‘శ్రీలత’, ‘గడప’, ‘బరాత్ బీట్’ పాటలు శ్రోతలను విపరీతంగా అలరించగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్‌ను క్రియేట్ చేసింది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబరు 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతున్న ఈ చిత్ర టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది.

అల్లరి నరేశ్ ఆల్కహాల్.. వచ్చేది అప్పుడే

హీరో అల్లరి నరేశ్ నటించిన తాజా చిత్రం ‘ఆల్కహాల్’. ‘ఫ్యామిలీ డ్రామా’ చిత్రంతో గుర్తింపు పొందిన మెహర్ తేజ్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమా ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 18 న థియేటర్లలోకి తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు.సినిమాలు చూడండి కాగా అల్లరి నరేష్ ప్రధాన పాత్రలో నటించగా, రుహానీ శర్మ, నిహారిక ఎన్ఎం కీలక పాత్రలు పోషించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించారు. అయితే ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్ ఆకట్టుకుంది. దర్శకుడు మెహర్ తేజ్ మంచి కామెడీ టైమింగ్ పంచ్‌లతో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది.



‘టాక్సిక్’ రిజల్ట్ నన్ను కుంగదీసింది : కియారా అద్వానీ

బాలీవుడ్ ప్రముఖ నటి కియారా అద్వానీ ఇటీవల నటించిన ‘టాక్సిక్’ సినిమా విడుదల సమయంలో తాను ఎదుర్కొన్న అనుభవాలు, భావోద్వేగాల గురించి తాజాగా ఓపెన్ అయ్యారు. సినిమా మొదటి రోజు వచ్చిన భారీ ఓపెనింగ్ కలెక్షన్లను చూసి అంతా సంతోషించినప్పటికీ, ఆ తర్వాత సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడం తన బృందానికి ఎంతో బాధ కలిగించిందని ఆమె తెలిపారు. ముఖ్యంగా ఆ తొలి వారాంతంలో ఈ పరాజయం తనను ఎంతగానో కుంగదీసిందని, ఆ క్షణాలు తనను తీవ్ర నిరాశకు గురిచేశాయని కియారా పేర్కొన్నారు. అయితే, తన సాధారణ కంఫర్ట్ జోన్‌ను పూర్తిగా పక్కన పెట్టి, కెరీర్‌లోనే ఎంతో సవాల్‌తో కూడిన ఒక విభిన్నమైన పాత్రను పోషించానని, ఆ పాత్రకు మాత్రం ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కడం తనకు కాస్త ఊరటనిచ్చిందని చెప్పారు. ఈ సందర్భంలో పెళ్లి తర్వాత సినిమాలలో రొమాంటిక్ సన్నివేశాలలో నటించడంపై వస్తున్న ట్రోల్స్, విమర్శల గురించి కూడా ఆమె స్పందించారు. తన భర్త, ప్రముఖ నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా ఈ విషయంలో ఎంతో మెచ్యూరిడ్‌గా వ్యవహరించారని కియారా కొనియాడారు. పెళ్లి తర్వాత రొమాంటిక్ సీన్లలో నటించడంపై సిద్ధార్థ్ ఎలాంటి అభ్యంతరం తెలపకపోగా, ఆ విషయాన్ని అసలు పట్టించుకోలేదని, ఎప్పుడూ తనతో ఆ గురించి ప్రస్తావించనేలేదని ఆమె వెల్లడించారు. తమ వివాహం తర్వాత ఈ అంశంపై ఇద్దరూ ఎప్పుడూ మాట్లాడుకోలేదని, ఆయనకు దీనిపై ఎలాంటి నెగెటివ్ అభిప్రాయం లేదని స్పష్టం చేశారు.





కోలీవుడ్‌లో సూర్య సరికొత్త చరిత్ర.. మూడు సినిమాలతో రూ.800 కోట్ల మైలురాయి!

టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న స్టార్ హీరో సూర్య, ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద తన సత్తా ఏంటో మరోసారి నిరూపిస్తున్నారు. 2026వ సంవత్సరం సూర్య కెరీర్‌లోనే అత్యంత అద్భుతమైన సంవత్సరంగా నిలుస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటికే వరుస విజయాలతో దూసుకుపోతున్న ఆయన, బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగిస్తున్నారు. కేవలం మూడు సినిమాలతోనే కోలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ ఏకంగా రూ.800 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రస్తుతం సూర్య నటించి, బాక్సాఫీస్ వద్ద భారీ విజయంతో దూసుకుపోతున్న (సీన్) సినిమా కలెక్షన్ల పరంగా అదరగొడుతోంది. విడుదలైన ప్రతీ చోటా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన తెచ్చుకుంటున్న ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద తన జోరును ఇంకా కొనసాగిస్తూ విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ సినిమా త్వరలోనే రూ.300 కోట్ల మార్కును చేరుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఈ చిత్రం ఈ అద్భుతమైన మైలురాయిని అందుకుంటే, సూర్య ఖాతాలోని మొత్తం వసూళ్లు ఏకంగా రూ.900 కోట్లకు చేరుకుంటాయి. ఇది కోలీవుడ్ ఇండస్ట్రీలో ఒక సరికొత్త సంచలనమనే చెప్పాలి. అంతేకాదు, ఈ ఏడాది సూర్య సాధించిన మరో అరుదైన ఘనత కోలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఒకే కేలండర్ ఏడాదిలో వరుసగా మూడు రూ.200 కోట్ల పైచిలుకు గ్రాసర్లను (200 జతీశీతీవ +తీశీంంవతీం) అందించిన ఏకైక తమిళ హీరోగా సూర్య అరుదైన చరిత్ర సృష్టించారు. ఎలాంటి అడ్డంకులనైనా ఎదుర్కొంటూ తన స్టార్ పవర్ ఏమాత్రం తగ్గలేదని ఆయన ఈ వరుస బ్లాక్‌బస్టర్లతో నిరూపించారు. ప్రేక్షకులను అలరించే వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ సూర్య బాక్సాఫీస్ రేసులో దూసుకెళ్తుండటంతో అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆయనపై అభినందనల వర్షం కురిపిస్తున్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,